Crime News
ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

| గురువారం, జూన్ 04, 2026 | సంపుటి - 20 | సంచిక 256 | వెల - 4రూ | పేజీలు - 12 |
|---|---|---|---|---|

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

### సుప్రీకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల 2లో



## మోస్తరు నుండి భారీ వర్షాలు

### తెలంగాణకు వాతావరణ శాఖ వర్ష హెచ్చరిక

### ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు

హైదరాబాద్ : తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది.

తరువాయి 2లో

## ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

### 21మంది దుర్మరణం చెందినట్లు గుర్తింపు

### ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని ఓ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిప్రమాదం కారణంగా 21 మంది చనిపోగా.. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళితే.. మల్వియా నగర్‌లోని, హౌజ్ రాణీ లైన్‌లో ఐదంతస్తుల భవనం ఉంది. భవనం బేస్‌మెంట్‌లో 'లెమన్ గ్రీన్ రెస్టారెంట్' ఉంది. బుధవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల్లో చిక్కుకుని 21 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తరువాయి 2లో





## తమిళనాడులో కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు

### వెల్లడించిన సిఎం విజయ్

చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం తమ కీలక భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానం కేటాయించింది. తమిళనాడు నుంచి రాజ్యసభ స్థానానికి జూన్ 18న ఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటును కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి విజయ్ 2లో



## కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

### ఉపముఖ్యమంత్రిగా జి. పరమేశ్వర్

### మొత్తం 13 మంది మంత్రుల ప్రమాణం

### సిద్దరామయ్య, ఖర్గేల తనయులకు కేబినేట్‌లో చోటు

### కార్యక్రమానికి హాజరైన రాహుల్, ఖర్గే, వేణుగోపాల్, రేవంత్ రెడ్డి

బెంగళూరు : కర్ణాటక ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నేత డికే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 4.05 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. డీకే శివకుమార్‌తో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. 2లో

## వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

### కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ మాట్లాడలేను

### తెలంగాణ అప్పులపై చర్చకు సిద్ధమే

### మీట్ ద ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




హైదరాబాద్ : వచ్చే ఏడాది పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానమిచ్చారు. పాదయాత్ర మొదలయ్యేలోపు ఫిట్ అవ్వాలని చూస్తున్నానని చమత్కరించారు. వచ్చే ఏడాది పాదయాత్ర ఎప్పుడు అనేది పార్టీ నిర్ణయిస్తుందని కేటీఆర్ తెలిపారు. 2027లో కచ్చితంగా పాదయాత్ర ఉంటుందని పునరుద్ఘాటించారు. ఎక్కడి నుంచి ఎక్కడికి, ఏ టైమ్‌లో పాదయాత్ర చేయాలనే దానిపై పార్టీలో పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. కడుపులో కత్తులు పెట్టుకుని.. పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని 2లో

## తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

### టెక్నాలజీ తదితర రంగాల్లో పరస్పర సహకారం

### యువతలో నైపుణ్యాలను తీర్చి దిద్దాలన్న సిఎం రేవంత్





హైదరాబాద్ : తెలంగాణ, జర్మనీలోని తూరంగియా రాష్ట్రాల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, థురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర సీఎం మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం తరువాయి 2లో

## తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

### జూన్ 5నుంచి అమల్లోకి రానున్న ఆదేశాలు

### మార్కెట్ రేట్ల మేరకు సవరణలు చేశామన్న పొంగులేటి




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం భూములు, ప్లాట్లు, ప్లాట్ల మార్కెట్ విలువల సవరణకు ఆమోదం తెలిపింది. కొత్త మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ల ధోరణి, డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని 144 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల మార్కెట్ విలువలు పెరిగాయి.

తరువాయి 2లో

## రాజకీయాల్లో కులదూషణలు దారుణం

### అమరజీవి పొట్టి శ్రీరాములుకు కూడా తప్పని కులచట్రం

### ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన



అమరావతి : భాష ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో బంధించ డానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిలో అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన కుల నిర్మూలన పక్కనబెడితే.. 1989 నుంచి రాజకీయాల్లో కుల దూషణలు విపరీతంగా పెరిగిపోయాయని మండిపడ్డారు.

తరువాయి 2లో


## ఆరోగ్యం ఉంటేనే సంపద

### సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులు

### యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదు


### 21న కృష్ణా తీరంలో యోగా ప్రదర్శనలు

### సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి



గుంటూరు : ఎంత సంపద ఉన్నా.. ఆరోగ్యం అవసరమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సంపూర్ణ ఆరోగ్యం ఉన్నవారే నిజమైన ధనవంతులని పేర్కొన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడులో సీఎం చంద్రబాబు పర్యటించారు. లలిత ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగించారు. వేల కోట్లు, పదవులు ఉన్నా ఆరోగ్యం లేకపోతే లాభంలేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి.. ల్యాండ్‌మార్క్ ఇన్‌స్టిట్యూట్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ హాస్పిటల్లోని స్కానర్ సౌత్ ఇండియాలోనే లేదని చెప్పుకొచ్చారు. లలిత ఆస్పత్రి 600 పడకల సామర్థ్యంతో 900 మంది సిబ్బందితో ప్రారంభమైందని సీఎం చంద్రబాబు తెలిపారు.

తరువాయి 2లో



## రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటే

### ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా రాజకయీాం చేయొచ్చు

### పవన్ కళ్యాణ్‌పై విమర్శల నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్య

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు రాజ్యాంగ రక్షణ లేదు

రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. సమాజ హితం, శాంతి భద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ఎ÷-లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా... వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొంది. ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది.

# మోస్తరు నుండి భారీ వర్షాలు

ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# తెలంగాణలో భూముల విలువల్లో సవరణ

ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ , అభివృద్ధి కారిడార్లు వంటి ప్రాజెక్టుల ప్రభావాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ ప్రాంతాల్లో భూముల విలువలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ విలువలను సవరించింది. ప్లాట్ల మార్కెట్ విలువల్లో ఉన్న అసమానతలను తొలగించేందుకు హేతుబద్ధీకరణ చేపట్టింది. కొన్ని ప్రాంతాల్లో అన్ని అంతస్తుల ప్లాట్లకు ఒకే మార్కెట్ విలువను అమలు చేయాలని నిర్ణయించింది. అలాగే హెచ్ఎండిఎ, క్యూర్ ఇతర ప్రాంతాలకు కనీస ప్రాథమిక మార్కెట్ రేట్లను నిర్ణయించింది. వ్యవసాయ భూములు, ప్లాట్లు, ప్లాట్లకు కొత్త కనీస మార్కెట్ విలువలను ఖరారు చేయడంతో పాటు నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రేట్లను కూడా సవరించింది. ఆర్‌సీసీ, నాన్-ఆర్‌సీసీ నిర్మాణాలకు సంబంధించిన విలువల్లో మార్పులు చేసింది. భూ లావాదేవీల్లో పారదర్శకతను పెంచడం, మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలను నిర్ణయించడం ఈ సవరణల ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో సవరించిన భూముల మార్కెట్ విలువలు జూన్ 5 నుంచి అమల్లోకి వస్తాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణ శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టామన్నారు. క్షేత్రస్థాయి అధ్యయనం, మార్కెట్ పరిస్థితుల మేరకు కొత్త విలువలు ఉన్నాయన్నారు. నిపుణుల సూచనలు, అధికారుల సలహాలతో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రాంతాలవారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు పరిశీలించామన్నారు. భూలావాదేవీల్లో సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా పునఃపరిశీలన చేశాం. 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలపై సమీక్ష జరిపాం. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు అధ్యయనం చేశాయి. అభివృద్ధి, భూముల డిమాండ్, మార్కెట్ పరిస్థితులు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, కొత్త రోడ్లు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణను ప్రమాణాలుగా తీసుకున్నాం. ఎ÷-లాట్ల విషయంలో అసమానతలు తొలగిస్తూ కొన్ని చోట్ల అన్ని అంతస్తులకు ఒకే ధర ఉంటుంది. ఇప్పటికే అధిక ధర ఉన్నచోట పెంపు ప్రతిపాదనలు లేవు. హెచ్ఎండీఏ, క్యూర్, ఇతర ప్రాంతాలకు ప్రాథమిక మార్కెట్ రేట్లు నిర్ణయించాం. 2021 తర్వాత నిర్మాణ వ్యయాలు సవరించడంతో కొత్త ధరల అవసరం ఏర్పడింది. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకతతో సవరణలు చేపట్టాంఅని మంత్రి తెలిపారు.

# తమిళనాడులో కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటు

ఒక ప్రకటనలో తెలియజేశారు. 'ఈనెల 18న తమిళనాడులో రాజ్యసభకు ఎన్నిక జరుగనుంది. ఆ రాజ్యసభ సీటును మా భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు కేటాయించాలని టీవీకే నిర్ణయం తీసుకుంది' అని విజయ్ పేర్కొన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి సీవీ షణ్ముగం తన రాజ్యసభ స్థానానికి మే 7న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 8వ తేదీ వరకూ రిటర్నింగ్ అధికారి ముందు నామినేషన్లు దాఖలు చేసుకోవలసి ఉంటుంది. 9వ తేదీ ఉదయం 11 గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటుంది. 11వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది. ఒకరు కంటే ఎక్కువ మంది పోటీలో ఉంటే జూన్ 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకూ సెక్రటేరియట్‌లో పోలింగ్ నిర్వహిస్తారు.

# మద్యం ఆదాయంపై ప్రత్యేక దృష్టి

### అందుబాటులోకి కొత్తగా 150, 200 ఎంఎల్ బాటిళ్లు

హైదరాబాద్,జూన్3 : తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ పాత నిబంధనలను సవరిస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90ఎంఎల్, 180ఎంఎల్, 375ఎంల్, 750ఎంఎల్ పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. అయితే, కొత్త సీసాల పరిమాణాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ మద్యం ధరల్లో ఎలాంటి మార్పులు ఉండబోవని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మద్యం మార్కెట్లో కొత్త మార్పులకు దారితీయనుంది.

# వచ్చే ఏడాది ఖచ్చితంగా పాదయాత్ర చేస్తా

ఈ సందర్భంగా కేటీఆర్ అన్నారు. అందుకే తనకు అహంకారమని అంటారేమో అని తెలిపారు. మీకు అహంకారమని అంతా అనుకుంటారని ఇంటర్వ్యూల్లో చెప్పారు కదా.. దాని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తారా అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ ఈ మేరకు స్పందించారు. నాకు అహంకారమని అంతా ఎందుకు అనుకుంటారని కచ్చితంగా ఆలోచిస్తుంటానని కేటీఆర్ తెలిపారు. అయితే కొంతమందికి కొన్ని కొన్ని మ్యాన్యుఫ్యాక్చరింగ్ డిఫెక్ట్ ఉంటాయని అన్నారు. అలాగే తనకు బాడీ లాంగ్వేజ్ సమస్య ఉందని తెలిపారు. అందుకే నవ్వుతూ మాట్లాడమని మిత్రులు చెబుతుంటారని.. కానీ అలా లేని నవ్వు తెచ్చుకుని నాకు మాట్లాడటం రాదని చెప్పారు. తెలంగాణ వాడిని కదా.. కడపులో కత్తులు, పెదవులపై చిరునవ్వులు పెట్టుకునే తెలివితేటలు తనకు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక విప్లవాన్ని తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధిలో నంబర్‌వన్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలో జరగలేదని స్పష్టం చేశారు. అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలిచ్చి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ ఆదాయం పతనమవుతోందని తెలిపారు. కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ పార్టీ అని ప్రజలకు అర్థమైందని అన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూనే ప్రభుత్వ ప్రకటనల కోసం కోట్లు ఖర్చు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్ అసత్య ప్రచారం చేస్తుందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేసిన అప్పు రూ.2.8 లక్షలు మాత్రమేనని తెలిపారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. అప్పులు చేడయంలో రేవంత్ ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని విమర్శించారు. అప్పు చేసి తీసుకొచ్చిన ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తీరుస్తున్నామని కాంగ్రెస్ చెబుతున్నది కాకిలెక్కలు అని కేటీఆర్ అన్నారు. ఏడాది కాలంలో రూ.29వేల కోట్ల అప్పు మాత్రమే తీర్చారని తెలిపారు. నెలకు రూ.6వేల కోట్ల అప్పు తీరుస్తాన్నమనేది అబద్ధమని స్పష్టం చేశారు. రూ.2వేల కోట్లే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వల్ల తెలంగాణకు ముప్పు పొంచి ఉన్నదని హెచ్చరించారు. రాష్ట్ర అప్పులపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చలకు సిద్ధమని స్పష్టం చేశారు.

# కర్నాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణం

ఆయనతో పాటు మరో 13 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలో హోం మంత్రిగా ఉన్న జి.పరమేశ్వర కర్ణాటక ఉపముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్యాంగం మినీబుక్‌ను చేతబట్టి డీకే ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. తన సీనియర్ అయిన సిద్ధరామయ్యను వేదికపైనే డీకే సత్కరించారు. జి. పరమేశ్వర ఉపముఖ్యమంత్రిగా, మరో 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనయుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటుదక్కింది. డీకే శివకుమార్ క్యాబినెట్ మంత్రులు 13 మంది చేత గవర్నర్ గెహ్లాట్ తావర్‌చందర్ గెహ్లాట్ ప్రమాణస్వీకారం చేయించారు. వీరిలో కేజీ జార్జ్, జి.పరమేశ్వర, రామలింగా రెడ్డి, కృష్ణ బైరే గౌడ, యూటీ ఖాదెర్, ఎంబీ పాటిల్, సతీశ్ జార్కిహోళి, ప్రియాంక ఖర్గే, యతీంద్ర సిద్ధరామ్యయ, లక్ష్మీ హెబ్బాల్కర్ ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, ఎ.రేవంత్ రెడ్డి, సుఖ్వీందర్ సింగ్ సుఖు, డీకే శివకుమార్ భార్య ఉషా శివకుమార్, కుమార్తె, పలువురు ఆధ్యాత్మిక నేతలు, విద్యార్థి, పౌరకార్మిక, రైతు ప్రతినిధులు, దళిత నేతలు, కన్నడ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆరోగ్యం ఉంటేనే సంపద

32 విభాగాలకు వైద్యసేవలు అందించే ఏకైక కేంద్రం ఇదని వివరించారు. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత ఉంటేనే.. ఏ వ్యవస్థ అయినా మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంచి అలవాట్లతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని చెప్పారు. యోగా, ధ్యానం చేస్తే అనారోగ్యం దరిచేరదని పేర్కొన్నారు. మనిషికి ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని సీఎం చంద్రబాబు తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వారే నిజమైన ధనవంతులని చెప్పుకొచ్చారు. ఆరోగ్యవంతులైన పౌరులు ఆరోగ్యకరమైన దేశాన్ని తయారు చేస్తారని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. సబ్జెక్టు అర్థం చేసుకుని వైద్య ఆరోగ్య శాఖను చక్కగా నిర్వహిస్తున్నారని చెప్పారు. సంజీవని పేరుతో డిజిటల్ హెల్త్ రికార్డు ప్రాజెక్టు తెస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య పరిజ్ఞానం తెచ్చి ప్రజలకు ఇస్తామని అన్నారు. వ్యాధులు రాకుండా ఏం చేయాలో, వ్యాధి నిర్ధారణ నివారణకు సంబంధించి అత్యుత్తమ విధానాలు అమలు చేస్తామని తెలిపారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తెచ్చి రెండున్నర లక్షల వరకూ ఉచిత వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఏం చేయాలో అన్నీ చేస్తామని.. కానీ అనారోగ్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. తినే తిండి, మంచి అలవాట్లు, మన పరిసరాలు, మనం ఆలోచించే విధానం ఆరోగ్యానికి చాలా ముఖ్యమని వివరించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మనం తినే ఆహారం మన ఆరోగ్యాన్ని కాపాడేలా ఉండాలని అన్నారు. గతంలో పంటలను రసాయన ఎరువులు, పురుగు మందులు వేయకుండా పండించామని ప్రస్తావించారు. జగన్ హయాంలో నాసిరకం మద్యం కారణంగా చాలామందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయని అన్నారు. వైసీపీ హయాంలో దుర్మార్గమైన నిర్ణయంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ధ్వజమెత్తారు. క్వాంటం, ఏఐ, డేటా సెంటర్, డిఫెన్స్ రీసెర్చ్ వంటి విభిన్న సాంకేతిక రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇంట్లోనే ఉంటూ ఫోన్లు వాడితే ఎలా...? కుటుంబ సభ్యులు నేరుగా మాట్లాడుకోవాలని సూచించారు. పది నిమిషాలు వ్యాయామం చేయటానికి ఓపిక లేకపోతే ఎలా..? అందుకే అనారోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీన మరోసారి యోగా ద్వారా రికార్డులు సృష్టిద్దామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. కృష్ణా నది బైపాస్ రహదారిపై యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సంప్రదాయ వైద్య విధానాలు ప్రమోట్ చేస్తున్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డులు వచ్చాయని ప్రస్తావించారు. మెడిటేషన్ యోగా కేంద్రాలు ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతన్నలు ప్రకృతి వ్యవసాయం చేయాలని సీఎం ఆకాంక్షించారు. ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం చంద్రబాబు వివరించారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తామని అన్నారు. 'ఆస్పత్రులు ఆలయాలని.. వైద్యులు దేవుళ్లు. వైద్యో నారాయణో హరి అనేది మన సంస్కృతిలో ఉంది. ఏపీని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలని తన కోరిక. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజమే మా లక్ష్యం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# తెలంగాణ, తూరంగియా మధ్య కీలక ఒప్పందం

హైదరాబాద్‌లో సీఎం ఎ. రేవంత్ రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని... ముఖ్యంగా ఏఐ ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని అన్నారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. సీఎం రేవంత్వ్యాఖ్యలకు స్పందించిన... తురింగియా సీఎం మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలంగాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుందని... సీఎం రేవంత్ నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోందని అన్నారు. తురింగియా సీఎం మాట్లాడుతూ సెమీకండక్టర్ రంగానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృందాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగతిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశంసించారు. ఈ సమావేశంలో తురింగియా సీఎం మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివర్ణించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని... ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

# రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటే

అమరావతి : రాష్ట్రాలు వేరైనా తెలుగువారంతా ఒక్కటేనని, అనవసర వివాదాలతో ప్రాంతీయ విద్వేషాలు సృష్టించడం సరికాదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తెలంగాణలో కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా, ఎక్కడైనా రాజకీయం చేసే హక్కు ఉంటుందని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'గతంలో నేను తమిళనాడు వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాను. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ కూడా ఇతర రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ తాము జాతీయ పార్టీ అని ప్రకటించుకుంది కదా.. ఇప్పుడెందుకు అనవసరంగా మాట్లాడుతున్నారు. అమెరికాలో కూడా తెలుగువారు సెనేటర్లు అవుతున్నారు. ప్రజాసేవ చేసినవారినే ప్రజలు ఆదరిస్తారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు తెలంగాణలో మాట్లాడుతున్న మాటలు ఎంతమాత్రం కరెక్ట్ కాదు. రెండు రాష్ట్రాలుగా విడిపోయి 12 ఏళ్లు అవుతోంది. ఇన్నాళ్ల తర్వాత ఇప్పుడెందుకు మళ్లీ ఇవన్నీ సృష్టిస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఎవరికీ మంచిది కాదు. తెలంగాణ రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ.. తెలుగువారిగా అంతా కలిసికట్టుగా ఉండాలి. రెండు రాష్ట్రాలనూ ప్రగతి పథంలో నడిపించుకోవడమే అందరి లక్ష్యం కావాలి' అని అన్నారు.

# ఢిల్లీ హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం

సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో హోటల్‌లో 40 మందికి పైగా జనం ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో ఎక్కువ మంది మధ్య ఆసియా, ఆఫ్రికాకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# రాజకీయాల్లో కులదూషణలు దారుణం

కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఏ కులం నాయకుడితో ఆ కులం వారినే తిట్టించే నీచ సంస్కృతి వల్ల యువత భావోద్వేగాలకు లోనవుతున్నారని ఆందోళన చెందారు. గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మరీ దిగజారిందని, సమాజానికి అద్దం పట్టే జర్నలిస్టులను సైతం కులాల పేరుతో దూషించడం ప్రారంభించారని ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. వైసీపీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని హత్య చేసి, శవాన్ని ప్యాక్ చేసి డోర్ డెలివరీ చేసినా ఆ పార్టీ వెనుకేసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి చంపేసినా ఆయా కుల సంఘాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయినా వైసీపీ తీరు మారలేదని, ఇలాంటి కుల రాజకీయాలకు చరమగీతం పాడాలని జనసేన గట్టిగా నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. ఇకపై రాజకీయాల్లో జరిగే కుల దూషణలను, అరాచకాలను తిప్పికొట్టేందుకు జనసేన పక్షాన 'సేన గళం' పేరుతో ఒక హైపవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు, ఇకపై ఎవరు దూషించినా 'సేన గళం' గట్టిగా స్పందిస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# జూబ్లీ వద్ద ప్రయానికులపై దూసుకెళ్లిన బస్సు

### బస్సు చక్రాల కింద ఇరుక్కుపోయిన యువకుడు

### క్రేన్ సాయంతో యువకుడికి విముక్తి..ఆస్పత్రికి తరలింపు

హైదరాబాద్ : సికింద్రాబాద్ జూబ్లీహిల్స్ బస్టాప్ సమీపంలో బుధవారం ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. నియంత్రణ కోల్పోయిన బస్సు ఒక్కసారిగా ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. జేబీఎస్ నుంచి కార్ఖానా వైపు వెళ్తున్న బస్సు అదుపు తప్పి ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న శివ అనే ద్విచక్ర వాహనదారుడిని బలంగా ఢీకొట్టింది. దీంతో యువకుడు తన బైక్‌తో సహా బస్సు ముందు చక్రాల కింద ఇరుక్కుపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి యువకుడిని కాపాడేందుకు శతవిధాలా ప్రయత్నించారు. కానీ బస్సును జరపడం సాధ్యం కాలేదు. సమాచారం అందుకున్న మారేడుపల్లి ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్రేన్‌ను రప్పించి, బస్సును పక్కకు జరిపి, యువకుడిని బయటికి తీశారు. అనంతరం అతన్ని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో మరో పరిణామం

### అడిషనల్ ఎస్పీ భుంజగరావు ఇంట్లో ఏసిబి సోదాలు

హైదరాబాద్,జూన్ 3 : నగరంలో ఏసీబీ అధికారుల సోదాలు కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న అడిషనల్ ఎస్పీ భుజంగరావు ఇంట్లో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. మొత్తం 15 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేస్తున్నారు. భుజంగరావు బంధువుల ఇళ్లల్లోనూ ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయి. సూర్యాపేటలోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. ఈరోజు సాయంత్రం వరకు సోదాలు కొనసాగే అవకాశం ఉంది. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు కీలక నిందితుడిగా ఉండి అరెస్ట్ అయి జ్యుడిషియల్ రిమాండ్‌కు వెళ్లి ప్రస్తుతం సస్పెండ్‌లో ఉన్నారు. పోలీస్ శాఖలో పనిచేసిన సమయంలో భారీగా ఆస్తులు కూడబెట్టారనే అభియోగం నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో 15 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు.

# చీలిక దిశగా తృణమూల్ కాంగ్రెస్

**మెజార్టీ ఎమ్మెల్యేల తిరుగుబావుటా**

**59మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంది**

**బహిష్కృత ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ వెల్లడి**



కోల్‌కతా,జూన్3 : అంతర్గత విభేదాలతో టీఎంసీ పార్టీ సతమతమవుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. తనకు 59 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని తృణమూల్ కాంగ్రెస్ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీలో పార్టీకి మొత్తం 80 మంది శాసనసభ్యులు ఉండగా.. వారిలో మూడింట రెండొంతుల కంటే ఎక్కువమంది మద్దతు తమకు ఉందని పేర్కొంటూ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. టీఎంసీ తిరుగుబాటు వర్గం ఆయనను కొత్త ప్రతిపక్ష నేతగా ప్రతిపాదిస్తు న్నట్లు తెలుస్తోంది. టీఎంసీ పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మందికి పైగా ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్న అనంతరం ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ప్రస్తుతం రెబల్ వర్గానికి అంతకంటే ఎక్కువ (59) మద్దతు ఉండడంతో వారు టీఎంసీ పేరు, చిహ్నాన్ని సొంతం చేసుకునే అవకాశం ఉంది. తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా ఇటీవల శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను సోమవారం తృణమూల్ సస్పెండ్ చేసింది. నాటి నుంచి పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు టీఎంసీలో కొనసాగుతోన్న గందరగోళం నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన 15 మంది ఎంపీలు తనను సంప్రదించారని బెంగాల్ భాజపా నేత దిబ్యేందు అధికారి ప్రకటించారు. అయితే ప్రస్తుతానికి ఎవరినీ పార్టీలోకి తీసుకోకూడదని భాజపా అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందాయని తెలిపారు. ఈ విషయంపై పార్టీ అధినేత మాత్రమే నిర్ణయం తీసుకుంటారన్నారు. టీఎంసీ పార్టీలో సంక్షోభం మరింత తీవ్రమయ్యే రోజు దగ్గరలోనే ఉందని.. మమతా బెనర్జీ నేతృత్వంలోని పార్టీ పతనం వైపు పయనిస్తోందని అన్నారు.

## హరీష్‌తో జాగ్రత్త కెటిఆర్

**బిఆర్ఎస్ పార్టీలో నాయకత్వ సమస్య ఉంది**

**ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్ : మాజీ మంత్రి హరీష్‌రావుతో రాజకీయంగా ప్రమాదం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తించారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ హెచ్చరించారు. సీఎల్పీ మీడియా హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. హరీష్‌రావుతో కేటీఆర్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్‌లో నాయకత్వ సంక్షోభం నెలకొందని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా అద్దంకి దయాకర్ విమర్శలు చేశారు. పదవుల కోసం త్యాగాలు చేశానని చెప్పే కేసీఆర్, ప్రతిపక్ష నాయకుడి హోదాకు రాజీనామా చేయాలన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై వస్తున్న విమర్శలను ఖండించిన ఆయన, భవిష్యత్తు లేని నాయకులకే ఫ్యూచర్ సిటీపై భయం పట్టుకుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం టాప్-100 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి తీసుకొచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అలాగే మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంపై కేటీఆర్‌కు పూర్తి అవగాహన లేదని, అవసరమైతే దానిపై ప్రత్యేకంగా క్లాస్ చెబుతామని ఎద్దేవా చేశారు. బీజేపీ నాయకత్వంపై సొంత పార్టీ నేతలకే నమ్మకం లేదన్న అద్దంకి దయాకర్, ప్రజలు మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. రెచ్చగొట్టే రాజకీయాలు చేసి లబ్ది పొందాలని ప్రయత్నించవద్దని ప్రతిపక్షాలకు అద్దంకి దయాకర్ సూచించారు.

## తెలంగాణ పోరాటాల గడ్డ

**పోరాడితేనే తెలంగాణ వచ్చింది**

**పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై గద్దర్ తనయ విమర్శలు**

హైదరాబాద్,జూన్ 3 : తెలంగాణ మీ అయ్య జాగీరా..? అంటూ జనసేన చీఫ్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్, గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా ఖండించారు. పవన్ కల్యాణ్ కామెంట్స్ నేపథ్యంలో వెన్నెల మాట్లాడుతూ.. పవనన్న మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఎప్పుడూ గౌరవిస్తూనే ఉంటారు. కానీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీరు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖచ్చితంగా ఖండిస్తున్నానన్నారు. తెలంగాణ సినిమాల్లో నటిస్తే రాలేదు.. తెలంగాణ పొత్తులకు పోతే రాలేదు. పైసలు పంచితే రాలేదు.. లాబీలు చేస్తే రాలేదు. తెలంగాణ పోరాటం ఓ సాయుధ పోరాటం. తమ రక్తం చిందించిన గడ్డగా నిలబడ్డ తెలంగాణ బిడ్డల త్యాగాల పోరాటం. తెలంగాణ ఒక ఆత్మగౌరవపోరాటం. ఎవరినీ ఒక్క బాధపెట్టకుండా.. హింసించకుండా తమను తాము ఆహూతి చేసుకున్న శ్రీకాంత్ చారియే సాక్ష్యమన్నారు. తెలంగాణ పోరాటం ఒక సాంస్కృతిక యుద్ధం. పాటలతో మాటలతో ప్రజల్లోకి వెళ్లి.. గడపగడపకెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేసిన పోరాట గాథలున్న ఈ తెలంగాణ గడ్డ. మా భూములు మావి.. మా నీళ్లు మావి..మా పాలన మాది అనే నినాదంతో పల్లెపల్లె గడప గడప త్యాగాలు చేసి సాధించుకున్న పోరాట గడ్డ. తెలంగాణ మా అయ్యల జాగీరే, రేపు మా బిడ్డల జాగీరు కూడా అంటూ వెన్నెల వ్యాఖ్యానించారు.

## రసవత్తరంగా బెంగాల్ రాజకీయాలు

**రితబ్రత బెనర్జీకి అసెంబ్లీలో ప్రతిపక్ష నేత**

**స్పీకర్ రతీంద్ర బోస్ ఆదేశాలు జారీ**

కోల్‌కతా,జూన్ 3 : పశ్చిమబెంగాల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా ఇస్తూ స్పీకర్ రతీంద్ర బోస్ ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షానికి కేటాయించిన ఛాంబర్ తాళాలను కూడా సిబ్బంది రితబ్రతకు ఇచ్చేశారు. అసెంబ్లీలో పార్టీ నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ను తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ ఎంపిక చేయడంతో పార్టీలో కలకలం రేగిన విషయం తెలిసిందే. ఆయన నాయకత్వాన్ని అంగీకరించబోమంటూ మొత్తం 80 ఎమ్మెల్యేల్లో 59 మంది తిరుగుబాటు బావుటా ఎగరవేశారు. ఆ తరువాత రితబ్రత సారథ్యంలో రెబల్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిశారు. తామే టీఎంసీ అని, రితబ్రతకే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని లేఖను సమర్పించారు. ఈ నేపథ్యంలో స్పీకర్ తాజాగా రితబ్రతను ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే, తమ నాయకురాలు మమతా బెనర్జీనేనని రితబ్రత ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తనకు పార్టీని చీల్చే ఉద్దేశం ఎంతమాత్రం లేదని అన్నారు. శోభన్‌దేబ్‌ను ప్రతిపక్ష నేతగా గుర్తించాలంటూ గత వారం టీఎంసీ అధినేత్రి మేనల్లుడు, ఎంపీ అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు లేఖ రాసిన విషయం తెలిసిందే. కానీ, స్పీకర్ ఈ లేఖను తిరస్కరించారు. ఈ లేఖలోని తమ సంతకాలను ఫోర్జరీ చేశారని ఎమ్మెల్యేలు రితబ్రత, సాందీపన్ ఆరోపించడంతో స్పీకర్ శోభన్‌దేబ్‌కు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదు.

## డికె ప్రమాణంలో రేవంత్

**ఆలింగనం చేసుకుని ఆప్యాయత చాటిన శివకుమార్**

బెంగళూర్,జూన్3 : కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్ ప్రాణ స్వీకారోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. పలువురు కాంగ్రెస్ పాలిత సిఎంలు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేంవత్‌ను డికె ఆలింగనం చేసుకుని తన అభిమానం చాటుకున్నారు. డి.కె.శివ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి సతీషన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలు పాల్గొన్నారు. కొత్త సిఎం డికెకు రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో మధుయాష్కీ భార్యకు గాయాలు

హైదరాబాద్,జూన్3 : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణి డా. సుచి అమెరికాలో జరిగిన కారు ప్రమాదంలో గాయపడ్డారు. మధుయాష్కీ దంపతులు తమ కుమార్తె డా. గగనను ఎండీ కోర్సులో చేర్పించి వేర్వేరు కార్లలో న్యూయార్క్‌కు వెళ్తుండగా డా. సుచి ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది.

## ఆంధ్రావాళ్లదే అసలైన ప్రాంతీయ వాదం

**మీరు బలవంతంగా కలుపుకుంటే విడిపోవాలనుకున్నాం**

**పవన్ వ్యాఖ్యలపై మాజీమంత్రి సింగిరెడ్డి విమర్శలు**

హైదరాబాద్,జూన్ 3 : ఆంధ్రరాష్ట్ర పునాదులపై ఏర్పడిందే అసలైన ప్రాంతీయ వాదం అని, ప్రాంతీయవాదం ఉగ్రవాదం అయితే మీరే ఉగ్రవాదులు అవుతారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఎద్దేవా చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ వాదంపై అక్కసు వెళ్లగిక్కిన నేపథ్యంలో నిరంజన్ రెడ్డి స్పందించారు. తెలంగాణ పౌర సమాజాన్ని కించపరిచేలా మాట్లాడిన పవన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాచరికపు పాలన పోయి తెలంగాణ దేశంలో విలీనం కావాలని పోరాటం చేసిన జాతీయ వాదులు మా తెలంగాణ ప్రజలు అని గుర్తు చేశారు. మమ్మల్ని బలవంతంగా ఆంధ్రా ప్రాంతంతో విలీనం చేసిని విషయాన్ని గుర్తు చేశారు. నాడు మీ దుర్మార్గాల నుంచి విడిపోవాలని పోరాడారు తప్ప తెలంగాణ ప్రజలు ప్రాంతీయవాదులు కాదని స్పష్టం చేశారు. పక్కా రాష్ట్రాల వాళ్లు వచ్చి మనల్ని వెక్కిరిస్తుంటే మౌనంగా చూస్తున్న రేవంత్ రెడ్డి పెద్ద ద్రోహి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడిన విధంగా మిగతా మంత్రులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. నీ నోళ్లకు పక్షవాతం వచ్చిందా అని ప్రశ్నించారు. అధికార పక్షం, ప్రతి పక్షం విషయంలో ఎన్నో విభేదాలు ఉండొచ్చు. కానీ, తెలంగాణకు అవమానం జరుగుతుంటే అందరు ఏకతాటి పైకి వచ్చి మాట్లాడకపోవడం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం పని చేస్తుందని సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**323 పాయింట్లు నష్టపోయిన బీఎస్ఈ సెన్సెక్స్**

ముంబై,జూన్ 3 : భారత స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 323 పాయింట్లు నష్టపోయి 74,326 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 86 పాయింట్లు నష్టపోయి 23,396 వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ నష్టాలతోనే ప్రారంభమైంది. సెన్సెక్స్ 74,300 పాయింట్లతో, 350కిపైగా పాయింట్ల నష్టంతో ప్రారంభమైంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 100 పాయింట్ల నష్టంతో 23,400 వద్ద ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ నష్టాల బాటలోనే సాగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పాలసీ మీటింగ్ ఈ రోజు ప్రారంభమైంది. వారాంతం వరకు కొనసాగనుంది. దీంతో వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం వంటి అంశాల్లో ఆర్బీఐ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అనే అంశంపై ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అమెరికా?ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్‌పై నెగెటివ్ ప్రభావం చూపాయి. హార్ముజ్ జలసంధి పూర్తిగా ఓపెన్ కాకపోవడం, చమురు ధరల పెరుగుదల వంటివి కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. దీంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి మార్కెట్ నష్టాల్లో ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్ర షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. వీటిలో టీసీఎస్ షేర్ దాదాపు 9 శాతం పతనమైంది. కోవిడ్ తర్వాత టీసీఎస్ షేర్లు ఈ స్థాయిలో పతనమవ్వడం ఇదే మొదటిసారి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్, ఇండిగో, ఎస్బీఐ, ఐసీఐసీఐ షేర్లు లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర అంతర్జాతీయ విపణిలో 4,461 డాలర్ల వద్ద కొనసాగింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 95.71గా ఉంది.

## అమరావతిపై విషంచిమ్ముతున్న జగన్

**రాజధానిపై పూటకో మాట..పూటకో ప్రకటన దారుణం**

**మండిపడ్డ మంత్రి సవిత**

అమరావతి,జూన్3 : ఏపీ రాజధాని అమరావతి, రాష్ట్ర అభివృద్ధిపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జగన్ వైఖరి వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చే పరిస్థితి లేదని, ఆయన రాష్ట్రాన్ని ఎప్పటికీ అభివృద్ధి చేయనివ్వరని విమర్శించారు. రాజధాని విషయంలో స్థిరత్వం లేకపోవడమే వైసీపీ సిద్ధాంతమని మంత్రి సవిత దుయ్యబట్టారు. రాజధానిపై రోజుకో మాట, పూటకో ప్రకటన చేయడం జగన్‌కు అలవాటుగా మారింది. గతంలో అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాష్ట్ర రాజధానిగా స్వాగతిస్తున్నామని జగన్ స్వయంగా చెప్పలేదా?' అని మంత్రి సవిత ప్రశ్నించారు. 'మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పుకొనే జగన్.. అధికారంలోకి రాగానే మూడు రాజధానుల డ్రామా తెరపైకి తెచ్చి ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. 5 ఏళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన చేసిన జగన్.. ఇప్పుడు మావిగన్ అంటూ మరో మాట మాట్లాడుతున్నారు. నలుగురు కుటుంబ సభ్యులున్న జగన్ కోసం నాలుగు ప్యాలెస్‌లు నిర్మించుకోవచ్చు కానీ.. రాష్ట్రంలోని 5 కోట్ల జనాభా కోసం అంతర్జాతీయ స్థాయి రాజధానిని నిర్మించకూడదా అని మంత్రి నిలదీశారు.

## ఫోన్ టాపింగ్ కేసు

**తీగల, లంకల దీపక్‌రెడ్డిలో సిట్ నోటీసులు**

హైదరాబాద్,జూన్3 : ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డికి సిట్. నోటీసుల ఇచ్చింది. ఈ కేసుకి సంబంధించి విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది సిట్. ఈమేరకు దీపక్ రెడ్డికి ఫోన్ కాల్ చేశారు సిట్ అధికారులు. విచారణకు ఎప్పుడొస్తారో చెప్పాలంటూ ఫోన్ కాల్ అడిగారు అధికారులు. ప్రశిక్షణ తరగతులు జరుగుతున్న క్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు అడిగి చెబుతానని బదులిచ్చారు దీపక్ రెడ్డి రెండు మూడు రోజుల్లో దీపక్ రెడ్డి సిట్ ముందు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. బండి సంజయ్ పాదయాత్ర, పార్లమెంట్ ఎన్నికల సమయంలో కిషన్ రెడ్డి దగ్గర పని చేశారు దీపక్ రెడ్డి. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గా పోటీ చేశారు లంకల దీపక్ రెడ్డి. జూన్ 4 ఉదయం 11 గంటలకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరుకావాలంటూ తీగల కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేసింది సిట్. 2014-18 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా ఉన్నారు తీగల కృష్ణారెడ్డి.

## తెలంగాణ ఏర్పాటుపై ఎందుకీ అక్కసు

**మా సచివాలయంలో వేలు పెడతానంటే ఊరుకుంటామా**

**పవన్ కళ్యాణ్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక**

హైదరాబాద్ : తెలంగాణ కచ్చితంగా ఇక్కడి భూమి పుత్రుల జాగీరే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని.. సోదరుడిగా ఇంటికి వస్తే.. హైదరాబాద్ బిర్యానీ పెడతామన్నారు. అంతే కానీ.. తమ సచివాలయంలో కూర్చుంటామంటే కుదరదన్నారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో జనసేన కొత్తగా చేసేదేముందని కేటీఆర్ అన్నారు. దేశభక్తి గురించి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 2023 ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేసిందని గుర్తుచేశారు. 2018లో చంద్రబాబు కూడా పోటీ చేశారని తెలిపారు. 'పవన్.. తెలంగాణలో పోటీ చేయండి.. ఎవరు వద్దంటున్నారు. ఇక్కడకు వచ్చి అనాయాసంగా మాట్లాడటం సరికాదు. నిజాం సర్కార్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు కదం తొక్కిన నేల ఇది. ఆవిర్భావ దినోత్సవం రోజు విభజన తీరు సరిగా లేదని అంటున్నారు. తెలంగాణపై ఉల్టాపల్టా మాటలెందుకు? తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదని చెప్పారు. తెలంగాణ ఆవిర్భావం రోజు పవన్ సభ పెడతానంటే ఎలా. పవన్ మీటింగ్‌ను అడ్డుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు. తెలంగాణకు దిక్సూచి కేసీఆర్ అని.. వేరే ఎవరూ అవసరం లేదన్నారు. 'పవన్ కళ్యాణ్.. మీరు ఇక్కడకి రండి.. మీ కుటుంబాలు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. ప్రాంతాలుగా విడిపోయినా.. ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ప్రాంతీయవాదం ఉగ్రవాదంతో సమానమని పవన్ అన్నారు. మద్రాసు నుంచి ఆంధ్ర వేరు పడాలని పొట్టి శ్రీరాములు పోరాడారు. అది కూడా ప్రాంతీయవాదమే అంటారా? మోదీ తన ప్రాంతీయవాదంతో.. తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తరలించుకుపోతున్నారు. జాతీయవాదం ముసుగులో ఆర్థిక పాంత్రీయవాదం చేయటం సరైందేనా? దీనికి పవన్ కల్యాణ్ సమాధానం చెప్తారా' అని కేటీఆర్ ప్రశ్నించారు. వందల మంది బలిదానాల రక్తంతో తడిసిన నేల తెలంగాణ అని మాజీ మంత్రి అన్నారు. ఒకటికి రెండు సార్లు ఆలోచించి పవన్ మాట్లాడాలని హితవుపలికారు. ఈ దేశంలో ఎవరైనా ఎక్కడైనా పోటీ చేయొచ్చని తెలిపారు. ఎక్కడైతే పోటీ చేయాలనుకుంటున్నారో ఆ ప్రాంత ప్రజల మనోభావాలు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. పోరాటాలు, త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ సాకారమైందని కేటీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్ర, తెలంగాణను కలిపింది కాంగ్రెస్ అని విమర్శించారు. 1969 ఉద్యమంలో 379 మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణిచివేసింది కాంగ్రెస్ అని విరుచుకుపడ్డారు. మలిదశ ఉద్యమంలో వేలాది మంది ప్రాణాలను బలిగొన్నది కాంగ్రెస్సే అని అన్నారు. తెలంగాణ కథలో నెంబర్ వన్ విలన్ కాంగ్రెస్సే అని.. తప్పని పరిస్థితుల్లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పోరాటం, దీక్ష లేకపోతే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. కేసీఆర్ హయాంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి ఏ రాష్ట్రంలోనూ జరగలేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా అని సవాల్ విసిరారు. అమలుకాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ చేసిందేంటి అని ప్రశ్నించారు. అప్పులు చేయడంలో రేవంత్ ప్రభుత్వం రికార్డ్ సృష్టిస్తోందని అన్నారు. రెండున్నరేళ్లలో రేవంత్ ప్రభుత్వం రూ.4లక్షల కోట్ల అప్పులు చేసిందని తెలిపారు. అప్పులపై ఒక్కో మంత్రి.. ఒక్కో లెక్క చెబుతున్నారన్నారు. కరోనా కంటే కాంగ్రెస్ ప్రమాదమని ప్రజలకు అర్థమైందని కేటీఆర్ పేర్కొన్నారు.

## ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా హైదరాబాద్

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనండి**

**దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో సిఎం రేవంత్ భేటీ**

హైదరాబాద్,జూన్3 : భారత్‌లో పర్యటిస్తున్న దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపై ఇరు పక్షాలు చర్చించాయి. తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని దక్షిణాఫ్రికా బృందాన్ని కోరారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికా కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను సీఎం ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే స్పందిస్తూ.. పెద్ద సంఖ్యలో తమ ప్రతినిధులు పాల్గొంటారని, ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం జర్మనీలోని తురింగియా రాష్ట్ర ప్రభుత్వం ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో వేగంగా విస్తరిస్తున్న శాస్త్ర సాంకేతిక, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, జీవ వైజ్ఞానిక రంగాల్లో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో తురింగియా ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

## సిఐ చినమల్లయ్యను సస్పెండ్ చేసిన ఐజి

పల్నాడు,జూన్3 : అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న సీఐ చిన్న మల్లయ్యను ఉద్యోగం నుంచి పోలీసుశాఖ డిస్మిస్ చేసింది. శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. తనపై అత్యాచారం చేశాడని సీఐ చిన్న మల్లయ్యపై ఓ మహిళ ఏప్రిల్ 29న వినుకొండలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై అత్యాచారం కేసు నమోదైంది. అప్పటి నుంచి సీఐ చిన్నమల్లయ్య అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయగా.. హైకోర్టు దానిని కొట్టివేసింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సీఐకి.. అక్కడ కూడా చుక్కెదురైంది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# సంపాదకీయం

## మమతీ కోటకు బీటలు !

కాంగ్రెస్‌లో ఉండగా ఫైర్‌బ్రాండ్ పేరు తెచ్చుకుని ప్రజలకు చేరువయ్యేలా ఎత్తులు, జిత్తుల వేసిన మమతా బెనర్జీ ఇప్పుడు దాదాపుగా ఒంటరిగా మారక తప్పడం లేదు. దాదాపు పదిహేనేళ్లు పశ్చిమబెంగాల్‌ను ఏకఛత్రాధిపత్యంగా పాలించిన దీదీ నిరంకుశ పాలనకు తెరతీశారు. బెంగాల్లో అధికారమే లక్ష్యంగా ఆమె చేసిన పనులు దేశ ఐక్యతను దెబ్బతీసే స్థితికి చేరాయి.లక్షల్లో బంగ్లా దేశీయుల చొరబాట్లను ప్రోత్సహించి, ఎన్నికల్లో విజయం సాధిస్తూ వచ్చినా.. పాపం పండింది. ఇప్పుడు ఎక్కడ చూసినా బంగ్లా జీతాయులు బెంగాల్‌ను వీడిపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. సువేందు అధికారి పగ్గాలు చేపట్టగానే తొలుత బంగ్లాదేశాయులను తరిమివేసే కార్యక్రమం చేపట్టారు. దీంతో ఇప్పుడు సరిహద్దుల్లో వారు వేలాదిగా గుమికూడి భారత్‌ను వీడే దృశ్యాలు కనిపిస్తున్నాయి. అధికారంలో ఉండగా నిరంకుశంగా వ్యవహరించారు. ఓ స్త్రీ అధికారంలో ఉంటే ఎంతగానో అభివృద్ధి చెందాలసిన బెంగాల్ అరాచక పాలనకు కేంద్రబిందువుగా మారింది. అత్యాచారాలు, దోపిడీలు, దొంగతనాలు రాజ్యమేలాయి. ఇవన్నీ ఇప్పుడు శాపంగా మారి మమతను వెంటాడుతున్నాయి. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తృణమూల్ కాంగ్రెస్‌లో చిచ్చు రేపుతోంది. ఫలితాలు వెలువడి నెల రోజులైనా కాకముందే.. అంతర్గత విభేదాలతో పార్టీ సతమత మవుతోంది. అధినాయకురాలు మమతా బెనర్జీకి పార్టీపై ఉన్న పట్టు సడలుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 50 మంది తృణమూల్ ఎమ్మెల్యేలు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవడం.. మంగళవారం స్వయంగా దీదీ నిర్వహించిన ధర్నాకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరు కావడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం అవతరించినప్పటి నుంచీ.. తృణమూల్‌లో తలెత్తిన అతిపెద్ద సంక్షోభంగా దీనిని చెప్పవచ్చు. బెంగాల్‌లో ఇటీవలి ఎన్నికల్లో తృణమూల్ తరఫున 80 మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభ, రాజ్యసభల్లో కలిపి పార్టీకి 40 మందికి పైగా ఎంపీలు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా మమత కోల్‌కతాలో భాజపా ప్రభుత్వానికి వ్యతిరేకంగా మంగళవారం చేపట్టిన నిరసనకు ఆరుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలే హాజరవటం అందరినీ ఆశ్చర్యపరిచింది. వీరిలో డెరెక్ ఓబ్రియెన్, కల్యాణ్ బెనర్జీ, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నైనా బందోపాధ్యాయ వంటి సీనియర్ నేతలే ఉన్నారు. కొత్తగా పార్టీ తరఫున ఎన్నికైనవారెవరూ నిరసనకు హాజరవలేదు. మమత అధ్యక్షతన ఇటీవల తృణమూల్ ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేయగా.. 20 మందే వచ్చారు. దీంతో ఆ సమావేశాన్ని రద్దు చేయాల్సి వచ్చింది.తృణమూల్ తమ శాసనసభా పక్ష నేతగా శోభన్‌దేబ్ ఛటోపాధ్యాయ్‌ని నియమించింది. అయితే ఆ నియామక ఉత్తర్వుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ పార్టీ ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా స్పీకరుకు ఫిర్యాదు చేయడం కలకలం సృష్టించింది. ఈ పరిణామంతో రితబ్రత, సందీపన్‌లను తృణమూల్ సస్పెండ్ చేసింది. పార్టీలో తిరుగుబాటు వర్గానికి రితబ్రత నాయకత్వం వహిస్తున్నారు. చీలిక వర్గానికి మెజార్టీ ఉందని అతను ప్రకటించడం మమతా బెనర్జీకి మింగుడుపడని వ్యహారంగా చూడాలి. తృణమూల్ ఎమ్మెల్యేల్లోని ఓ వర్గం తమ శాసనసభా పక్ష నేతగా రితబ్రతను నియమించాలని కోరుకుం టున్నట్లు సమాచారం. పార్టీని చీల్చి, గుర్తును కూడా సొంతం చేసుకునేందుకు దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు యత్నిస్తున్నట్లు స్వయంగా తృణమూల్ అధికార ప్రతినిధి రిజుదత్తా పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం.. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు చీలిక వర్గానికి మూడింట రెండొంతుల శాసనసభ్యుల మద్దతు అవసరం. అంటే తృణమూల్ తిరుగుబాటు వర్గంలో 53 మంది ఎమ్మెల్యేలు ఉండాలి. ఆ బలం కూడగట్టుకునే ప్రయత్నాల్లో భాగంగానే దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు సోమవారం రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. స్వయంగా మమత, ఆమె సన్నిహితుడు కునాల్ ఘోష్ కూడా తృణమూల్‌లో విభేదాలు ఉన్నాయని అంగీకరించారు. పార్టీ నాయకత్వానికి తెలియకుండా రహస్య సమావేశాన్ని ఏర్పాటుచేసి పార్టీలో చీలిక తెచ్చేందుకు రితబ్రత ప్రయత్నిస్తున్నట్లు కునాల్ ఆరోపించారు. వీటిని రితబ్రత ఖండించారు. అయితే టీఎంసీ కనుమరుగయ్యే అవకాశం ఉందని, అది ఇకపై మనుగడ సాధించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత 100 మంది కౌన్సిలర్లు తృణమూల్‌ను వీడారు. ఇప్పటికే పలువురు నేతలు కూడా టీఎంసీ నాయకత్వంపై ముఖ్యంగా మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ వరుస పరిణామాలు టీఎంసీకి పొంచిఉన్న సంక్షోభానికి సంకేతాలుగా కనిపిస్తున్నాయి. తృణమూల్ రెండుగా చీలనుందని, మహారాష్ట్ర పరిస్థితులే బెంగాల్‌లోనూ రానున్నాయని మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో భాజపా గెలుపు అనంతరం తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత, మాజీ సీఎం మమతా బెనర్జీ ధర్నా చేపట్టారు. భాజపాకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడుతానని ఆమె శపథం చేశారు. దేశవ్యాప్తంగా భాజపాకు వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీలు దిల్లీలో సమావేశమవుతాయి. ఎన్ని బెదిరింపులు వచ్చినా నిరసన కొనసాగుతుందని మమత స్పష్టంచేశారు. అయితే అధజకారంలో ఉండగా అత్తా అల్లుళ్ల ఆగడాలను నేతలతో పాటు ప్రజలు కూడా సమించారు. కానీ పరిస్తితి మారింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో వీరంతా తిరుగుబాటు జెండా ఎగరువేశారు. ఏ జెండాకు ఆగొడుగు పట్టి, నానా యాగీ చేయడం మమతా బెనర్జీ నైజం. మొన్నటి ఎన్నికల్లో అలాగే చేయబోయారు. కానీ బిజెపి పన్నిన ఉచ్చులో పడ్డ మమత గిలగిల కొట్టుకోవడం మినహా చేయగ లింది లేదు. మమతను ప్రజలే ఛీత్కరించుకునే స్థాయికి వచ్చింది.

## అందనంత దూరంలో ఆరోగ్య భారతం



ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించి ఉండవచ్చుగాక. ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా చోటు సంపాదించి ఉండవచ్చుగాక. అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా దేశదేశాల నీరాజనాలు అందుకుంటూ ఉండవచ్చుగాక. కానీ, జాతి జనుల ఆరోగ్య పరిరక్షణలోనూ, వారికి సరైన పోషకాహారాన్ని అందించడంలోనూ, వైద్య సౌకర్యాలు కల్పించడంలోనూ ఇప్పటికీ వెనుకబడే ఉందన్న చేదు నిజం దేశానికి తలవంపులు తెస్తోంది. ఆసియాలోనే అత్యాధునిక వైద్య చికిత్సలను అందించే దేశాల్లో చైనా తర్వాతి స్థానం భారత్ దే. వైద్యంకోసం ఇక్కడకు వచ్చే విదేశీయుల సంఖ్య గత దశాబ్దకాలంలో ఇబ్బడిముబ్బడిగా పెరగడమే ఇందుకు నిదర్శనం. అయితే పేదలకు మాత్రం ఈ వైద్య సదుపాయాలు అందని ద్రాక్షలానే ఉంటున్నాయి. ప్రజారోగ్యం, పోషకాహారం, కుటుంబ నియంత్రణ, మహిళల ఆర్థిక సాధికారత, జీవనశైలి, ఆహారపు అలవాట్లు వంటి అనేక అంశాలపై తాజాగా వెలువడిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికను విశ్లేషిస్తే, ప్రజల ఆరోగ్యం మేడిపండు చందంలానే ఉందన్న వాస్తవం కళ్లముందు కనబడుతుంది. చిన్నారుల్లో మానసిక, శారీరక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యం. అయితే ఆరునుంచి 23 నెలల లోపు పిల్లల్లో 80 శాతం మందికి చాలినంత పౌష్టికాహారం అందడం లేదు. దురదృష్టవశాత్తూ నిరుపేద పిల్లల్లో అధిక సంఖ్యాకులకు కేలరీలతో కూడిన తిండి దొరుకుతోందే తప్ప, విటమిన్లు, కొవ్వులు, ఖనిజ లవణాలతో కూడిన పౌష్టికాహారం దక్కడం లేదు. పర్యవసానంగా 35 శాతం మంది పిల్లలలో రక్తంలో ట్రైగిసరైడ్ల శాతం పెరిగి, గుండెజబ్బులకు దారితీస్తోందని గత ఏడాది విడుదలైన సమగ్ర పౌష్టికాహార సర్వే సైతం కుండబద్దలు కొట్టింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదికను బట్టి ఇళ్లవద్ద కాకుండా ఆసుపత్రులలో ప్రసవించే మహిళల శాతం గణనీయంగా పెరగడం చెప్పుకోదగిన శుభపరిణామమే అయినా, సాధారణ ప్రసవాలకంటే సిజేరియన్ ప్రసవాలు పెరుగుతున్నాయన్న వాస్తవం ఆందోళనకరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం 10 నుంచి 15 శాతం లోపు ఉండవలసిన సిజేరియన్ ప్రసవాలు 27.2 శాతానికి పెరిగినట్లు కుటుంబ ఆరోగ్య సర్వే స్పష్టం చేస్తోంది. మరీ ముఖ్యంగా ప్రైవేటు ఆసుపత్రులలో ఈ రేటు 54.1 శాతంగా నమోదు కావడం ఆయా ఆస్పత్రి యాజమాన్యాల స్వార్థకాంక్షను బట్టబయలు చేస్తోంది. ఇక భారతదేశానికి చిరునామాగా మారిన మధుమేహం, ఊబకాయం వంటి జీవనశైలి గాడి తప్పడం వల్ల తలెత్తే వ్యాధుల తీవ్రత కూడా ఎక్కువగానే ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. మరిన్ని కనుగొనండి ఆధ్యాత్మిక కంటెంట్ తెలంగాణ వార్తలు అంతర్జాతీయ వార్తలు చాశ్రీంశీ =ఘుం - డికెకు అధికార పీఠం.. కమలంలో కలవరం ప్రతి ఆరుగురిలో ఒకరు మధుమేహంతోను, దేశ జనాభాలో 30 శాతం మంది ఊబకాయంతోనూ బాధపడుతున్నారట. ఈ రెండు వ్యాధులూ తోడైతే రక్తపోటు, గుండె, మూత్రపిండాల జబ్బులు పెరుగుతాయనేది తెలిసిందే. చిన్నపిల్లల్లోనూ ఊబకాయుల సంఖ్య అంతకంతకు పెరుగుతోందనేది మరింత ఆందోళన కలిగించే అంశం. ప్రభుత్వాల నిరంతర కృషి ఫలితంగా సాంక్రమిక వ్యాధుల విజృంభణ తగ్గినా, జీవనశైలి లోపం కారణంగా తలెత్తుతున్న వ్యాధుల నివారణలోనూ, వాటిపై ప్రజలను జాగృతం చేయడంలోనూ పాలకవర్గాలు వెనుకబడే ఉన్నాయనడానికి సర్వే ఫలితాలే తాజా నిదర్శనం. గ్రామీణ ప్రాంతాలకూ ఆరోగ్య సేవలు విస్తరింపజేయడమే లక్ష్యమని పదేపదే వల్లె వేసే పాలకులు జీవనశైలి మార్పుల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు విప్పిచెప్పడంలో శ్రద్ధ వహించడం లేదు. మాతాశిశు సంరక్షణ దిశగా కీలకమైన సేవలు అందించే అంగన్వాడీలకే రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వంటి వ్యాధులు, జీవనశైలిలో మార్పులవల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించే బాధ్యతలనూ అప్పజెప్పడం వల్ల ఆశించిన ప్రయోజనాలు కొంతమేరకైనా నెరవేరవచ్చు. ప్రాసెస్డ్, జంక్ ఫుడ్ వల్ల తలెత్తే విపరిణమాల గురించి చిన్నారుల్లో చైతన్యం కల్పించే దిశగా ఆయా అంశాలకు పాఠ్యపుస్తకాలలో చోటుకల్పించాలి. అవసరం ఉన్నా లేకున్నా సిజేరియన్, హిస్టరెక్టమీ వంటి శస్త్రచికిత్సలను ఎడాపెడా చేస్తూ మహిళల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు ఆస్పత్రుల ఆట కట్టించేందుకు ఇప్పుడు అమలవుతున్న చట్టాలకు మరింత పదును పెట్టవలసిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా 715 జిల్లాల్లో, 6.79 లక్షల కుటుంబాల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన తాజా కుటుంబ ఆరోగ్య సర్వేను ప్రామాణికంగా తీసుకుని ఆరోగ్య భారతాన్ని నిర్మించేందుకు నడుం బిగించడం పాలకుల తక్షణ కర్తవ్యం.

## గంగపాలెంలో పెద్దపులి సంచారం

### పలు పశువులపై దాడి చేసి చంపిన పులి

### ఆందోళనలో స్థానిక ప్రజలు

ఏలూరు,జూన్3 : పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గంగపాలెంలో పెద్దపులి సంచారం కలవరపెడుతోంది. మంగళవారం రాత్రి పశువులపై దాడి చేసిన పులి.. 16 దూడలు, ఒక గేదెను హతమార్చింది. దీంతో గ్రామస్థుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో భారీగా పశువులు ఉండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు.. మైదాన ప్రాంతాల నుంచి గండి పోచమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులను పోతవరం వద్ద అటవీ శాఖ అధికారులు నిలిపేస్తున్నారు. మొత్తంగా గంగంపాలెం గ్రామం సమీప ప్రాంతాల్లో పెద్దపులి సంచారంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురువుతున్నారు. గత కొద్ది రోజులుగా అటవీ ప్రాంతాల నుంచి గ్రామాల వైపు వస్తున్న పెద్దపులి మూగజీవాలపై వరుసగా దాడులు చేస్తోంది. ఇప్పటివరకు 14 ఆవుదూడలు, 2 గేదెలను చంపింది. దీంతో రైతులు, పశుపోషకులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.గ్రామ శివార్లలో సంచరిస్తున్న పులి పశువుల మందలపై దాడి చేస్తోంది. ముఖ్యంగా గంగంపాలెం, దండంగి, పోశమ్మగండి గ్రామాల పరిసర ప్రాంతాల్లో ప్రజలు బయటకు రావడానికి కూడా భయపడుతున్నారు. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకూడదని గ్రామ పెద్దలు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం పెద్దపులి దండంగి గ్రామం, పోశమ్మగండి గ్రామాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి కదలికలను పర్యవేక్షించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. అదేవిధంగా అటవీశాఖ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి పులిని సురక్షితంగా పట్టుకునేందుకు చర్యలు చేపట్టాయి. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అటవీ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని సూచిస్తున్నారు. పులి కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. ఈ ఘటనతో దేవీపట్నం మండలం పరిసర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. ఒకవైపు పశువుల నష్టం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తుండగా, మరోవైపు ప్రజల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పులిని త్వరగా పట్టుకుని తిరిగి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## ఎపి ప్రకృతి వ్యవసాయానికి గుర్తింపు

### ప్రతిష్ఠాత్మక 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026' పురస్కారం

అమరావతి,జూన్ 3 : ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్ఠాత్మక 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్–2026' పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం కు దక్కింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. ఇది రాష్ట్రానికి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఖా సంస్థ, శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో లభించిన ఈ పురస్కారాన్ని రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఈ నమూనాను దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సుస్థిర వ్యవసాయ రంగంలో ఆంధప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు రైతాంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రిన్స్‌టన్ విద్యా సంస్థలకు సుప్రీం మొట్టికాయలు


### అమెరికా యూనివర్శిటీ పేరు వాడంపై ఆంక్షలు

### తక్షణం సంబంధం లేదంటూ ప్రకటన విడుదలకు ఆదేశం

న్యూఢిల్లీ,జూన్3 : అమెరికాలో ఉన్న ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ పేరు వాడుతుండటంపై తెలంగాణలోని ప్రిన్స్‌టన్ విద్యాసంస్థలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ యూనివర్సిటీకి తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తూ బోర్డులు పెట్టాలని తెలంగాణ కాలేజీని ఆదేశించింది. జూన్ 12లోగా ప్రముఖ దినపత్రికల్లో కనీసం పావు పేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించింది .అమెరికా యూనివర్సిటీ విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ 'ప్రిన్స్‌టన్' పేరుతో కాలేజీలను నడుపుతోంది. తమ ట్రేడ్‌మార్క్‌ను వినియోగిస్తున్న వాగ్దేవి సంస్థలపై అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక 'ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ' కేసు పెట్టింది. దీనికి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. కాలేజీ వెబ్‌సైట్లలో అందరికంటే పెద్ద అక్షరాలతో 'డిస్‌క్లెయిమర్ నోటీసు' స్పష్టంగా ప్రదర్శించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కళాశాలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లు, ఇతర అన్ని పత్రాలు, ఫారాలపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని స్పష్టం చేసింది. నూతన విద్యా సంవత్సరం అడ్మిషన్ల పక్రియ ప్రారంభమయ్యేలోపే నిబంధనలను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరుతో విద్యార్థులు అయోమయానికి గురి కాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## నామ స్మరణమే.. శరణం!

ప్రపంచవ్యాప్తంగా భక్తులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. సర్వాకర్షకుడైన శ్రీకృష్ణుడి ఆవిర్భావ లీలనే కృష్ణాష్టమి. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భగవానుడి దివ్య ఆవిర్భావాన్ని స్మరించుకుంటూ, ఆయన అపార కరుణను అనుభూతి చెందేందుకు ఒక మహత్తర అవకాశం. ఈ పవిత్ర దినం మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపి, భగవంతుడితో మన సనాతన సంబంధాన్ని గుర్తు చేస్తుంది. శ్రీకృష్ణుడి జననం సాధారణ శిశువుల వలె సంభవించినది కాదు. వాస్తవానికి ఆయన పుట్టుక లేనివాడైనప్పటికీ, తన ఆంతరంగిక శక్తితో ఈ లోకాన అవతరించడం భగవానుడి దివ్య లీలల్లో ఒకటి. దేవాదిదేవుడు, పరబ్రహ్మం, సర్వశక్తిమంతుడైన శ్రీకృష్ణుడు కేవలం ఆయన స్వీయ సంకల్పం మేరకే లోకంలో అవతరిస్తాడు గానీ, భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. మథురలోని కంసుడి కారాగారంలో దేవకీ వసుదేవులకు జన్మించినప్పుడు, శ్రీకృష్ణుడు శంఖ, చక్ర, గదా, పద్మాలతో చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. తల్లి దేవకి ప్రార్థన మేరకు ఒక సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. శ్రీకృష్ణుడు అవతరించిన ఆ శుభ ఘడియలలో లోకమంతా ఆనందం, శాంతి నెలకొని, దిక్కులన్నీ ప్రసన్నమైనట్టు శ్రీమద్భాగవతం చెబుతుంది. అవతార లక్ష్యం.. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించేందుకు తాను యుగయుగాన అవతరిస్తానని శ్రీకృష్ణుడే స్వయంగా ప్రకటించాడు. అంతేగాక, ఆయన జీవితం, లీలలు, బోధనలు మానవాళికి గొప్ప సందేశాన్ని అందిస్తాయి. శ్రీకృష్ణుడు కేవలం ఏడేళ్ల వయసులో తన చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని ఎత్తి, దానిని ఏడు రోజుల పాటు నిలబెట్టాడు. ఇది ఆయన అసాధారణ శక్తిని, మనం ఆయన్ని ఒక సాధారణ మానవుడిగా చూడకూడదని నిరూపిస్తుంది. ఆయన లీలలు ప్రాపంచిక మాలిన్యాలకు అతీతమైనవి. శ్రీకృష్ణుడి జననం, కర్మల దివ్యత్వాన్ని తెలుసుకున్నవారు ఈ భౌతిక ప్రపంచంలోకి తిరిగి రారు, శాశ్వత ధామాన్ని చేరుకుంటారు. మానవ జన్మకు అంతిమ లక్ష్యం భగవంతునితో ప్రేమపూర్వక సంబంధాన్ని పునరుద్ధరించుకోవడమే! భగవద్గీతలో శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన పరమ సందేశం 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' (సమస్త ధర్మాలను త్యజించి నన్నే శరణు పొందు). ఇది మోక్షాన్ని పొందే అత్యంత సరళమైన మార్గం.



ఆధ్యాత్మికం

# మధిరలో ఐటీ హబ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు

● ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ● స్థానిక యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కల్పన ● డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలియజేసిన మధిర కాంగ్రెస్ పార్టీ నాయకులు



**మధిర ప్రతినిధి, జూన్ 3 (ది క్రైమ్ న్యూస్):** మధిర నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో కీలక హామీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అమలు చేశారు. మధిరలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ఐటీ టవర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. మధిర గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 43లో ఉన్న 1.16 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ ప్రతిష్టాత్మక ఐటీ హబ్ నిర్మించనున్నారు. ఐటీ మరియు కమ్యూనికేషన్స్ శాఖ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు మార్గం సుగమమైంది. ఐటీ హబ్ నిర్మాణానికి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టుకు సంబంధించిన వ్యయ అంచనాలు, బడ్జెట్ అవసరాలపై నివేదికలను త్వరితగతిన సమర్పించాలని సూచించింది. మధిరకు ఐటీ హబ్ మంజూరు కావడంతో నియోజకవర్గ ప్రజలు, యువత, మేధావులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు సొంత ప్రాంతంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఇతర అనుబంధ రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభించనున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మధిర పట్టణంలోని మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయంలో మధిరకు ఐటి హబ్ మంజూరు చేసినందుకు మల్లు భట్టి విక్రమార్క కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధిర మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మన్ కోన ధని కుమార్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మిర్యాల వెంకటరమణ గుప్తా, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తలుపుల వెంకటేశ్వర్లు, , మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, కౌన్సిలర్ బోడేపూడి రేవతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జనరల్ సెక్రటరీ పులిబండ్ల చిట్టిబాబు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, డివిజన్ కమిటీ అధ్యక్షురాలు అద్దంకి మంజీరా, కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, రంగా శ్రీనివాసరావు, సామినేని రామనాథం, సిద్ధంశెట్టి సందీప్ మొదలగు వారు పాల్గొన్నారు.



# ఘనంగా మధిరలో మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు

● ప్రజలకాంక్ష మేరకే మధిరలో 100 పడకుల ఆసుపత్రి ● మాజీ మంత్రి హరీష్ రావు సేవలు కొనియాడిన లింగాల కమల్ రాజ్





**మధిర జూన్ 3, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మధిర పట్టణంలో మాజీ రాష్ట్ర మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు పుట్టిన రోజు సందర్భంగా మధిర లో బీ.ఆర్.యస్ పార్టీ ఆద్వర్యం లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మధిర పట్టణం లోని 100 పడకల ఆసుపత్రి వద్ద జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు పండ్లు, మజ్జిగ ప్యాకెట్ అందించారు. ఈ సందర్భంగా లింగాల కమల్ రాజు మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో మధిర ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు 100 పడకల ఆసుపత్రి కోసం 34 కోట్ల రూపాయలను ఆనాడు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న తన్నీరు హరీష్ రావు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు, అలానే ఆసుపత్రి నిర్మాణం కూడా శరవేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. హరీష్ రావు ఆరోగ్య, అర్దిక శాఖల్లో తనదైన ముద్ర వేసారని రాష్ట్ర స్థితిగతుల పై పూర్తి అవగాహన ఉన్న గొప్ప నాయకుడు హరీష్ రావు అన్నారు. కార్యక్రమం లో మధిర సొసైటీ చైర్మన్ బిక్కీ కృష్ణప్రసాద్, నాయకులు పల్లపోతు వెంకటేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు,



మున్సిపల్ కౌన్సిలర్ యన్నంశెట్టి అప్పారావు, అరిగే శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, తాళ్లూరి హరీష్ బాబు, అబ్బూరి రామన్, ఇక్బాల్, వంకాయలపాటి నాగేశ్వరరావు, భువనగిరి నారాయణ రావు, ఆళ్ల నాగబాబు, గద్దల స్వామి, సత్యనారాయణ రెడ్డి, చిదిరాల రాంబాబు, శ్రీను, దిల్ కుమార్, కాకుమాను కృష్ణమూర్తి సహ పలువురు పాల్గొన్నారు.

# కరీంనగర్- జగిత్యాల జాతీయ రహదారికి లైన్ క్లియర్... కేంద్రం గ్రీన్ సిగ్నల్..

● కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితోనే కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే ● ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నితిన్ ● గడ్కరీ, బండి సంజయ్‌లకు కృతజ్ఞతలు తెలిపిన పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు

**కరీంనగర్ టౌన్, జూన్ 03(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ - జగిత్యాల జాతీయ రహదారికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అతిపెద్ద తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం రోజున జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో జగిత్యాల - కరీంనగర్ జాతీయ రహదారిని (ఎన్ హెచ్-563) 4 వరుసలుగా (4-లైన్లు గా) విస్తరించేందుకు కేంద్ర క్యాబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపింది. కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ రావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ జగిత్యాల నేషనల్ హైవే నిర్మాణం చేపట్టడం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. బండి సంజయ్ కృషితోనే నేడు కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారి సాకారం అవుతుందన్నారు. ప్రధానంగా తెలంగాణలోని రెండు ప్రధాన రహదారుల విస్తరణకు (ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల మరియు జగిత్యాల-కరీంనగర్) కలిపి మొత్తం రూ.?7,597.16 కోట్లను కేంద్రం కేటాయించిందని తెలిపారు. ఇందులో కేవలం జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ కోసమే రూ.?2,395 కోట్లు ఖర్చు చేయనున్నారని తెలిపారు. దాదాపు 58 కిలోమీటర్ల పొడవుతో జగిత్యాల - కరీంనగర్ సెక్షన్‌ను పద్ధతిలో విస్తరించనున్నారని తెలిపారు. ఇందులో భారీ ట్రాఫిక్ ఉండే జనాభా ప్రాంతాలను తప్పిస్తూ కొత్తగా 34.96 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు కూడా నిర్మించనున్నారని ఈ హైవేపై వాహనాలు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా డిజైన్ చేస్తున్నారనీ తెలిపారు.. ముఖ్యంగా ఈ 4 లేన్ల రోడ్డు అందుబాటులోకి వస్తే జగిత్యాల - కరీంనగర్ మధ్య ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాల పాటు కలిసి వస్తుందని, ఈ హైవే విస్తరణ వల్ల జగిత్యాల, పోతారం, గంగాధర, కరీంనగర్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా తొలిగిపోనున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పీఎం గతి శక్తి కింద రూపు దిద్దుకోవడం వల్ల కరీంనగర్, జగిత్యాల జిల్లాల సామాజిక, ఆర్థికాభివృద్ధికి, ముఖ్యంగా స్థానిక వ్యాపారాలకు, రైతులకు తమ ఉత్పత్తులను రవాణా చేయడానికి ఎంతో మేలు చేకూరనుందన్నారు.



# సైలెన్సర్లు మార్పిడి చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు: రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్

**రామగిరి, జూన్ 03(ది క్రైమ్ న్యూస్):-** వాహనాల సైలెన్సర్లలో అనుమతి లేకుండా మార్పులు చేసి అధిక శబ్దం కలిగించే విధంగా ఉపయోగిస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కల్వచర్ల గ్రామంలో మాడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగించి అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి వాటిని తొలగించి వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు కంపెనీ ద్వారా అందించిన ఒరిజినల్ సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. అలాగే తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించినట్లయితే, అట్టి వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సురక్షిత ప్రయాణం అలాగే ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. అలాగే ఎవరైనా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే సమాచారం అందించాలని రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ సూచించారు.




# లింగాపూర్ గ్రామంలో భారీగా ఇసుక డంపులు

## అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్

**కరీంనగర్ టౌన్, జూన్03(ది క్రైమ్ న్యూస్):** లింగాపూర్ గ్రామంలో కొందరు ట్రాక్టర్ యజమానులు భారీగా ఇసుకను నిల్వ చేసి, అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మానేరు వాగు నుండి ప్రతి రోజూ రాత్రి పూట ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నట్లు వారు తెలిపారు. లింగాపూర్ ఇసుక క్వారీ నుండి ఇసుక రవాణాకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, నిబంధనల ప్రకారం సాండ్ టాక్స్ చెల్లించి ట్రాక్టర్లలో ఇసుకను తరలించాల్సి ఉంటుందని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే, కొందరు యజమానులు టాక్స్ చెల్లించకుండా, రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా డంపులు పోసి, మానకొండూర్ మీదుగా కరీంనగర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ రవాణాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, ఇసుక డంపులపై దాడులు చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లింగాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# 49వ డివిజన్ అర్హులైన పేద మహిళలకు చీరల పంపిణీ

## కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం

## లబ్ధిదారులకు అండగా మన సనాతన ధర్మం సేవా సమితి





**కరీంనగర్ టౌన్, జూన్03(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 49వ డివిజన్ పరిధిలోని దారిద్ర రేఖకు దిగువన ఉన్న అర్హులైన పేద మహిళలకు బుధవారం చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 'మన సనాతన ధర్మం సేవా సమితి' డివిజన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై, మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఓటు హక్కు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి అర్హులైన పేద మహిళకు ఈ చీరలను అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ గాయత్రి, వార్డ్ ఆఫీసర్ మెండే శిరీషలతో పాటు డివిజన్ మహిళలు విజయలక్ష్మి, శారద, మమత, కవిత, సులోచన, సౌజన్య, స్వరూప, లావణ్య పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకులు, కార్యకర్తలు లంబు సుధాకర్ రెడ్డి, గాదగోని రమేష్, భూమ్ రావు, నల్మచు సంతోష్, ప్రవీణ్ రెడ్డి మరియు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్‌కు ఉత్తరాఖండ్ సీఎం అభినందనలు

## సీఎం పుష్కర్ సింగ్ ధామిని సన్మానించిన మేయర్ కోలగాని



**కరీంనగర్ టౌన్, జూన్03(ది క్రైమ్ న్యూస్):** ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేశ్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రోజున జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ను ఈ సందర్భంగా అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం ప్రప్రదంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఇటీవల బిజెపి ఘన విజయం సాధించిన నేపథ్యంలో, మేయర్ గా అతి పిన్న వయసు కలిగిన కోలగని శ్రీనివాస్ నియామకం కావడం పట్ల సీఎం పుష్కర్ సింగ్ ధామి సంతోషం వ్యక్తం చేశారు. మేయర్ కోలగాని శ్రీనివాస్ ఈ సందర్భంగా ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామికి కృతజ్ఞతలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. అలాగే సమావేశాలకు అతిథులుగా హాజరైన ఉత్తరాఖండ్ రాష్ట్ర మంత్రులు సుబోధ్ ఉన్నియాల్, ప్రేమ్ చంద్ర అగర్వాల్ , మదన్ కౌశిక్ ,లోకసభ సభ్యులు (హరిద్వార్) త్రివేంద్ర సింగ్ రావత్ రాజ్యసభ సభ్యులు, మహేంద్ర భట్, డా. ప్రేమ్ చంద్ర అగర్వాల్ (ఎమ్మెల్యే, ఋషికేశ్ నియోజకవర్గం)లను మేయర్ కోలగని శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఓపెన్ జిమ్ పరికరాలను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

**రామగిరి, జూన్ 03(ది క్రైమ్ న్యూస్):-** మంథని మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఓపెన్ జి మ్ పరికరాలను మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ పరిశీలించారు. బుధవారం మున్సిపల్ ఏఈ మౌనిక తో కలిపి ఆయన ఓపెన్ జిమ్ పరికరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఓపెన్ జిమ్ ను ప్రారంభించనున్నారని దీనికోసం ఓపెన్ జిమ్ ఏర్పాట్లు చిన్న చిన్న లోపాలు గుర్తించినట్లు ఆయన తెలిపారు. వీటిని సరిదిద్ది ప్రారంభానికి ఓపెన్ జిమ్ ను సిద్ధం చేస్తున్నట్లు అయన తెలిపారు. ఆయన వెంట మంథని రెడ్డి సంఘం గౌరవ అధ్యక్షుడు ఎంఎస్ రెడ్డి ఉన్నారు.



# తల్లిదండ్రుల కలలకు సాకారం చేకూర్చాలే

● పట్టుదలతో కష్టపడితేనే లక్ష్యం సాధించగలం ● ఉన్నతంగా ఎదిగి మంచి పేరు తీసుకురావాలి ● మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**రామగిరి,జూన్ 03(ది క్రైమ్ న్యూస్):-** తమ పిల్లల భవిష్యత్ కోసం ఎంతో కష్టపడి చదవించే తల్లిదండ్రుల కలలకు సాకారం చేకూర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఇటీవల విడులైన ఇంటర్, ఐఐటీ ఎంట్రన్స్ పరీక్షలో జాతీయ స్థాయి ర్యాంకు, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారుపతకం సాధించిన విద్యార్థిలకు బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ దంపతులు శాలువాలతో సన్మానించి స్వీట్లు అందజేసి అభినందించారు. ఐఐటీ ఎంట్రన్స్ పరీక్షలో జాతీయ స్తాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిన రామగిరి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్ కుమారుడు శంకేషి అఖిల్ 3868 ర్యాంకు రాగా ఓబీసీ కోటాలో809 ర్యాంకు సాధించారు. అలాగే మంథని ప్రభుత్వ బాలికల జానియర్ కళాశాలలో చదువుకున్న పెండ్యాల శ్రీనిధి ఇంటర్‌లో 1000 కి గాను 975 మార్కులతో పాటు ఎప్ సెట్ లో 15 వేల ర్యాంక్, గుజరాత్ రాష్ట్రంలో గాంధీ నగరంలో రాష్ట్రీయ రక్ష యూనివర్సిటీలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్మా చేతుల మీదుగా ఇంటర్నేషనల్ లీగల్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ బిఏ ఆనర్స్ లో బంగారు పతకం అందుకున్న రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన గద్దల శంకర్- స్వరూప దంపతులు కుమార్తె శ్రీ లక్ష్మి ప్రసన్న, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో మహాముత్తారం మండలం దొబ్బలపహాడ్ గ్రామానికి చెందిన హట్కర్ రేశ్వంత్ నాయక్ 537వ ర్యాంక్, మహాముత్తారంకు చెందిన బానోత్ శశాంక్ 630ర్యాంక్ సాధించి ప్రతిభ చాటగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో కష్టపడి చదివితేనే అనుకున్న లక్ష్యం సాధించుకోగలమని చెప్పారు. తల్లిదండ్రులు అనేక కష్టాలు ఎదుర్కొంటూ మనల్ని చదివిస్తారని అలాంటి తల్లిదండ్రుల ఆశలను నిరాశ చేయవద్దన్నారు. మంచిగా చదువుకుని ఉన్నతంగా ఎదిగి మన ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు





తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తగరం శంకర్ లాల్, పూదరి సత్యనారాయణ, కనవేణ శ్రీనివాస్ యాదవ్, జంజర్ల శేఖర్, పుప్పాల తిరుపతి, పోలు కనకరాజు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే ధ్యేయం.. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

● చిన్న చెరువు కట్ట ఆధునీకరణ, ఎస్టీపీ ప్లాంట్ పనుల పురోగతిపై క్షేత్రస్థాయి పరిశీలన





**నల్గొండ ప్రతినిధి, జూన్ 3(ది క్రైమ్ న్యూస్):** పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మిర్యాలగూడ ఎమ్మెల్యే పేర్కొన్నారు. బుధవారం పబ్లిక్ హెల్త్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి పట్టణంలో కొనసాగుతున్న చిన్న చెరువు కట్ట ఆధునీకరణ పనులు, మురుగునీటి శుద్ధి కేంద్రం (ఎస్టీపీ) నిర్మాణ పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని చిన్న చెరువు కట్టను మరింత పటిష్టంగా నిర్మించాలని సూచించారు. కట్టపై ప్రజల కోసం వాకింగ్ ట్రాక్, ఆధునిక లైటింగ్ సదుపాయాలు, పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్లాంట్ సామర్థ్యం, మురుగునీటి శుద్ధి ప్రక్రియ, సాంకేతిక అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో ఎస్టీపీ ప్లాంట్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు చోటుచేసుకోకుండా అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజారోగ్యానికి ఎలాంటి ముప్పు వాటిల్లకుండా పబ్లిక్ హెల్త్ అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ చిలుకూరి బాలకృష్ణ, కౌన్సిలర్ శ్రీజ, కాంగ్రెస్ నాయకులు బంటు లక్ష్మీనారాయణ, మేడ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని జిల్లాల కలెక్టర్ల, డిఈఓ లతో వీడియో కాన్ఫరెన్స్ ..

● ఉన్నత విద్యాశాఖ అధికారులు అందరికి సమీక్ష నిర్వహించాలి... ● రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి... ● రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ యోగితారాణ.. ● విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ.. ● జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్





**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్03(ది క్రైమ్ న్యూస్):-** రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ యోగితారాణ, అన్ని జిల్లాల కలెక్టర్ల, డిఈఓ లక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, ఇతర ఉన్నత విద్యాశాఖ అధికారులు అందరికీ సమీక్ష నిర్వహిస్తూ విద్యార్థుల తక్కువ నమోదు పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల నమోదు పెంచుటకై గ్రామంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని ,కనీస సామర్థ్యాలు అయినటువంటి చదవడం రాయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో ఏర్పాటు చేసే మౌలిక వసతుల గురించి తల్లిదండ్రులకు వివరించాలని, వీటి ఆధారంగానే పాఠశాలలకు ప్రగతి సూచికలు ఇవ్వబడతాయని ,రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ పాఠశాలలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అలాగే ఎఫ్ఆర్ఎస్, ఇతర అంశాలపై దృష్టి పెట్టి సరియగుచర్యలు గైకొనాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి , ఇంటర్మీడియట్ అధికారి మదర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థలు ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజ్ తదితర విద్యా సంస్థలలో అడ్మిషన్ల శాతం పెంచాలని, జిల్లాలోని భవిత కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని, కొత్త ప్రీ ప్రైమరీ విభాగాలను ప్రారంభించాలని, విద్యార్థుల సంఖ్యలేని పాఠశాలలను తిరిగి ప్రారంభించాలని, పాఠ్యపుస్తకాల పంపిణీ చేయాలని, స్వయం సహాయక బృందాల చేత పిల్లలకు యూనిఫామ్ కుట్టించాలని, నూతన టెక్నాలజీ ఏఐ, డిజిటల్ తరగతులను నిర్వహించాలని, విద్యాశాఖ బలోపేతానికి ప్రత్యేక కార్యచరణ ప్రకారం ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.

# ఆక్రమణలను తొలగించండి పేదల పక్షాన పోరాటం తప్పదు

## ● సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా ప్రభుత్వ భూములు అక్రమించిన వారిపై చర్యలు తీసుకుని ఆక్రమణలను తొలగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఆక్రమణలను తొలగించకపోతే పేదలచే ప్రభుత్వ భూములు అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం హవేలీ సిపిఐ కార్యాలయంలో జరిగిన హవేలీ శాఖ సమావేశం నానబాల రామకృష్ణ -అధ్యక్షతన జరిగింది. సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సంపన్నుల పట్ల, కబ్జాదారుల పట్ల మేతక వైఖరిని అవలంభిస్తుందన్నారు. నిలువ నీడ లేక కాలువలపై గుడిసెలు వేసుకున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించిందని ఈ ఖాళీ చేయడానికి ఎవరు కారకులో వారే ఇప్పుడు నాగార్జున సాగర్ కాలువ కట్టలను అక్రమిస్తున్నారని సురేష్ ఆరోపించారు. ప్రభుత్వం తమకు అండగా నిలబడుతుందని ఆక్రమణదారులు, కబ్జాదారులు విస్తృత ప్రచారం చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లా యంత్రాంగం ఇదే రీతి అవలంభిస్తే పేదలను సమీకరించి ప్రభుత్వ భూములను అక్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. - సర్వే పరిశీలన ప్రభుత్వ భూముల ఆక్రమణకు సంబంధించి సిపిఐ ఫిర్యాదు మేరకు జరుగుతున్న ఆక్రమణలను సిపిఐ బృందం పరిశీలించింది. నీటిపారుదల -శాఖ,



కార్పోరేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం 12వ డివిజన్లో ఎన్నెస్పి కాలువ ఆక్రమణలకు సంబంధించి సర్వే నిర్వహించి మార్కింగ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్ అధికారులతో మాట్లాడుతూ నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, సహయ కార్యదర్శి నానబాల రామకృష్ణ, నాయకులు ఉపేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి

## జి.యంలు సుంకర మధుసూదన్, కొలిపాక నాగేశ్వరరావు



**రామగిరి, జూన్ 03(ది క్రైమ్ న్యూస్):-** పర్యావరణాన్ని కాపాడుకోవాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా జూన్1 నుండి 12 వరకు వివిధ సంస్థలకు పర్యావరణం పై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమాన్ని బుధవారం ఆర్ జి-3, ఏపీఏ జిఎం కార్యాలయం నందు నిర్వహించారు.మంథని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దేవదాస్ కార్యాలయ అధికారులకు, ఉద్యోగులకు పర్యావరణం పై అవగాహన కల్పించారు. సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం తమ వంతు బాధ్యతగా ఎన్నో లక్షల మొక్కలను నాటుతుందని అందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఇట్టి కార్యక్రమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ, ప్రతి సంవత్సరం మొక్కలను నాటాలని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ప్రతి సంవత్సరం సింగరేణి సంస్థ నాటుతున్న మొక్కల వివరాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటుజియంలు బండి సత్యనారాయణ, బి.వి.సత్య నారాయణ, పర్యావరణాధికారి రాజారెడ్డి, విభాగధిపతులు బి.టి.మురళీ కృష్ణ, బి.సుదర్శనం, అఫ్సర్ పాష, రాజేశ్వరి, శ్యామల, అటవీశాఖ అధికారులు మంగీలాల్, శ్రీకాంత్, వరప్రసాద్ తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# నిప్పును పెట్టడం మానుకుందాం భూసారాన్ని రక్షించుకుందాం



**రామగిరి,జూన్ 03(ది క్రైమ్ న్యూస్):** పంట పొలాల్లో వ్యర్థాలను నిప్పు పెట్టడం మానుకొని భూసారాన్ని రక్షించుకుందామని రామగిరి ఖిల్లా కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ వెంకట్ అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో ఖేతి బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో నేల సంరక్షణపై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది, రసాయనిక ఎరువులకు బదులుగా జీవన ఎరువులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని తెలియజేయడం జరిగింది. సరియగు వర్షపాతం నమోదైన తర్వాతనే పంటలను సాగు చేయాలని తెలియజేయడం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి కిల హెడ్ డాక్టర్ వెంకట్ రమేష్, డాక్టర్ బి నవ్య, గ్రామ సర్పంచి షీలారపు మల్లయ్య ,మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్వేత మరియు రైతులు పాల్గొన్నారు.

# బదిలీ పై వెళ్తున్న ఏరియా ఇంజనీర్లలకు ఆత్మీయ సన్మానం



**రామగిరి, జూన్ 03(ది క్రైమ్ న్యూస్):-** రామగుండం-త్రీ ఏరియా లో ఏరియా ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తూ ఎస్టిపిపి పవర్ ప్లాంట్ బదిలీ పై వెళ్తున్న వి.వి.సుధాకర్ రెడ్డి, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తు కార్పోరేట్ భూగర్భ గనుల విభాగానికి బదిలీపై వెళ్తున్న కె. యాదయ్య లను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు బుధవారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియంలు బి.వి.సత్య నారాయణ, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, ప్రవీణ్ వి ఫాంటింగ్, కె. జనార్దన్, విభాగాధిపతులు కాశీ విశ్వేశ్వర రావు, రాజేంద్ర కుమార్, బి.టి.మురళీ కృష్ణ, రాజారెడ్డి, రాజేశ్వరి, రవి చరణ్, సునీల్ ప్రసాద్, తో పాటు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల నియంత్రణకే కార్డెన్ సర్చ్

## గోదావరిఖని టూ టౌన్ సిఐ నక్క ప్రసాదరావు



**రామగిరి,జూన్ 03(ది క్రైమ్ న్యూస్):-** దొంగతనాల నియంత్రణకే గ్రామాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహించడం జరుగుతుందని గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాదరావు అన్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోరఝ ఆదేశాల మేరకు కమాన్ పూర్ మండలం పెంచికలపేట గ్రామంలో మంగళవారం రాత్రి కమాన్ పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో గోదావరిఖని పోలీసులు, కమాన్ పూర్ పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 37 ద్విచక్ర వాహనాలు ఐదు కార్లు రెండు ఆటో లను స్వాధీన పరుచుకున్నారు. అనంతరం వాటి యొక్క డాక్యుమెంట్లు పరిశీలించి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సిఐ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామాల్లోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు ఎదురైతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈమధ్య చాలావరకు దొంగలు నమ్మించి మోసాలు చేస్తున్నారని ఎవరైనా గ్రామాలకు వెళ్తే తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్త ఉండాలని సూచించారు. అలాగే ఎవరైనా ఓటీపీలు అడిగితే చెప్పకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని టూ టౌన్ సిఐ లింగమూర్తి, కమాన్ పూర్ ఎఎస్ఐ రహీం, హెడ్ కానిస్టేబుల్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్..

## • కిడ్నాప్ చేసి రూ.5.26 లక్షలు వసూలు





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పోలీసులమని నమ్మించి ఓ వ్యాపారవేత్తను కిడ్నాప్ చేసి, బెదిరింపులకు పాల్పడి రూ.5.26 లక్షలు దోచుకున్న నకిలీ పోలీసుల ముఠాను జగద్గిరిగుట్ట పోలీసులు, కూకట్‌పల్లి సీసీఎస్ బృందం సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పోలీసుల కథనం ప్రకారం కూకట్‌పల్లికి చెందిన కావూరి పూర్ణచంద్రరావు (42) ఈ నెల 18న ప్రశాంత్‌నగర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, జగద్గిరిగుట్టలోని శోభోదయ కాలనీ సమీపంలో కారులో వచ్చిన నిందితులు అడ్డగించారు. తమను పోలీసులమని పరిచయం చేసుకుని, హర్యానాలో మీపై కేసు నమోదైందని చెప్పి విచారణ పేరుతో బలవంతంగా కారులోకి ఎక్కించారు. అనంతరం బాధితుడి మొబైల్ ఫోన్, ఏటీఎం కార్డు, నగదు స్వాధీనం చేసుకుని బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు తెలుసుకున్నారు. హర్యానా పోలీసు అధికారిగా నటిస్తూ నకిలీ వీడియో కాల్ ఏర్పాటు చేసి మరింత నమ్మించారు. బాధితుడిని సూర్యాపేటకు తీసుకెళ్లి ఏటీఎంల ద్వారా రూ.1 లక్ష నగదు డ్రా చేయడంతో పాటు ఫోన్‌పే, నెట్ బ్యాంకింగ్ ద్వారా మరో రూ.4.26 లక్షలు బదిలీ చేయించుకున్నారు. డబ్బు వసూలు చేసిన అనంతరం బాధితుడిపై దాడి చేసి, సిమ్ కార్డు తొలగించి, సాధారణ మొబైల్ ఫోన్ ఇచ్చి నిర్మానుష్య ప్రాంతంలో వదిలేసి పరారయ్యారు. సాంకేతిక ఆధారాలు, ప్రత్యేక దర్యాప్తు ద్వారా నిందితులు నాగరాజు రఘువర్మ అలియాస్ కార్తికేయ, యశ్వంత్ సింగ్, సత్యభాన్ సింగ్, తంగెళ్లపల్లి నాగేంద్ర వర్మ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎయిర్ పిస్టల్, దేశీయ తయారీ తుపాకీ, నకిలీ పోలీసు యూనిఫాంలు, ఐడీ కార్డులు, హ్యాండ్‌కఫ్స్, పోలీసు స్టాంపులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. జైల్లో పరిచయమైన వీరు విడుదల అనంతరం ముఠాగా ఏర్పడి, ఆర్థికంగా బలమైన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. పరారీలో ఉన్న నిందితుల అరెస్టు కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినట్లు కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎన్. కోటి రెడ్డి తెలిపారు.

# సీఎంసీ ప్రధాన కార్యాలయానికి త్వరలో శంకుస్థాపన..

## ఏర్పాట్లను పరిశీలించిన ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) నూతన ప్రధాన కార్యాలయ భవనానికి త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ నేపథ్యంలో మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో మొండికుంట చెరువు సమీపంలో నిర్మించనున్న సీఎంసీ ప్రధాన కార్యాలయ స్థలాన్ని బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎంసీ కమిషనర్ సృజన, డీసీపీ రితీరాజ్, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీ బాలకృష్ణతో పాటు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు హాజరయ్యారు. శంకుస్థాపన కార్యక్రమం, సభా ప్రాంగణ ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన పాలన, వేగవంతమైన సేవలు అందించే లక్ష్యంతో ఈ భవన సముదాయాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. ఒకే చోట అన్ని పౌర సేవలు అందుబాటులో ఉండేలా, ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కార్యాలయాన్ని నిర్మిస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ఈ భవనం కీలకంగా మారుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సుమారు రూ.2,000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.530 కోట్ల వ్యయంతో మియాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్నట్లు తెలిపారు. అలాగే 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి కూడా త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. గచ్చిబౌలి ఐఐటీ జంక్షన్ వద్ద రూ.459 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతుండగా, ఖాజాగూడ జంక్షన్ వద్ద రూ.220 కోట్లతో చేపట్టిన ఫ్లైఓవర్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయని చెప్పారు. రూ.308 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న లింగంపల్లి ఆర్‌ఓబీ ఫ్లైఓవర్ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. కొండాపూర్, చందానగర్ ప్రాంతాల్లో రూ.100 కోట్లతో కోర్ అర్బన్ పాఠశాలల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన జరిగిందని పేర్కొన్న ఆయన, అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యకరమైన, ఆధునిక, ప్రశాంత శేరిలింగంపల్లిని నిర్మించడమే తన లక్ష్యమని, ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్లైఓవర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన : ఆరెకపూడి గాంధి



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు రూ.530 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక ఫ్లైఓవర్ ప్రాజెక్టుకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ నేపథ్యంలో శంకుస్థాపన స్థలం, సభా ప్రాంగణ ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎంసీ కమిషనర్ సృజన, డీసీపీ రీతిరాజ్, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీ బాలకృష్ణ, ఏసీపీ రవికిరణ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్తో పాటు సీఎంసీ, హెచ్ఐసీటీఐ ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మియాపూర్ చౌరస్తా ప్రాంతంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ భారీ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు 1790 మీటర్ల పొడవుతో ఆరు లేన్ల ద్విముఖ ఫ్లైఓవర్ నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే హాఫీజ్‌పేట్ నుంచి మియాపూర్ వరకు మూడు లేన్ల యూని డైరెక్షనల్ అండర్‌పాస్, బాచుపల్లి నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు మరో మూడు లేన్ల అండర్‌పాస్‌ను కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మియాపూర్, హాఫీజ్‌పేట్, చందానగర్, బాచుపల్లి ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిత్యం ట్రాఫిక్ రద్దీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వేలాది మంది వాహనదారులకు ఈ ఫ్లైఓవర్ ఎంతో ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ఇంధన వ్యయం కూడా తగ్గుతుందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ట్రాఫిక్ రహిత నగరాల లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఫ్లైఓవర్‌లు, అండర్‌పాస్‌ల నిర్మాణాన్ని చేపడుతోందని ఆరెకపూడి గాంధీ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఐటీ రంగం విస్తరణ, పెరుగుతున్న జనాభా నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు హెచ్ఐసీటీఐ ప్రాజెక్టు ద్వారా పలు కీలక పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులన్నింటినీ నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాల సవాళ్లకు ముందస్తు వ్యూహం..

## క్షేత్రస్థాయిలో పర్యటించిన సైబరాబాద్ సీపీ, సీఎంసీ కమిషనర్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాలను నివారించేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టే దిశగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన సంయుక్తంగా పలు సమస్యాత్మక ప్రాంతాల్లో బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. వర్షాల సమయంలో తరచుగా నీటి నిల్వలు ఏర్పడే ప్రాంతాలను గుర్తించి, అక్కడి పరిస్థితులను సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ పరిధిలోని మల్కం చెరువు, బయోడైవర్సిటీ జంక్షన్ సమీపంలోని కేర్ హాస్పిటల్ ప్రాంతం, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రోడ్, కొండాపూర్‌లోని హర్ష టయోటా షోరూమ్ జంక్షన్ తదితర ప్రాంతాలను సందర్శించి నీటి పారుదల వ్యవస్థ, డ్రైనేజీ పరిస్థితులను పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో నీటి నిల్వలకు కారణమవుతున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించడం, వర్షపు నీరు వేగంగా వెళ్లిపోయేలా అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించడంతో పాటు ప్రజా రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగేలా పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో వర్షాకాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ముందస్తు చర్యల వల్ల వర్షాల సమయంలో నీటి నిల్వలు, ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కూకట్‌పల్లి డీసీపీ రితీరాజ్, ఏడీసీపీ హనుమంతరావుతో పాటు ఇంజినీరింగ్, మున్సిపల్, ట్రాఫిక్ శాఖలకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ నియంత్రణకు ఉద్యమిద్దాం: తిరుమలగిరి అశోక్

### అధిక ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంల పేరిట దోపిడీపై ఆగ్రహం



**నల్గొండ ప్రతినిధి, జూన్ 3 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ పట్టణంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని, ఈ పరిస్థితిని నియంత్రించడంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని బీసీ నాయకుడు విమర్శించారు. మిర్యాలగూడలో నిర్వహించిన బీసీ యువజన, విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చుకుని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు నిర్ణయించి తల్లిదండ్రుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. లక్షల రూపాయల ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు భారం మోపుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే ఆశతో తల్లిదండ్రులు భూములు, బంగారం విక్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, మరికొందరు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితులకు కారణమైన విద్యా వ్యాపారాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ, అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోకపోతే బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో శంకర్, ఉపేందర్, గంగాధర్, రాంబాబు, మనీ తదితరులు పాల్గొన్నారు.

## మద్దికుంటలో ఘనంగా ఎల్లమ్మ పట్నాలు....



**మానకొండూర్, జూన్3(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం మద్దికుంటలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు బుధవారం పట్నాలతో ముగిసాయి. స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో తొలి రోజు దేవుడి గంగ స్నానం, జోగు తిరగడం, పోచమ్మ బోనాలు, పుట్టదని, లందకపోవుట, ఎల్లమ్మ బోనాలు, సుంకు పుట్ట కార్యక్రమాలను నిర్వహించారు. ఉత్సవాల ముగింపు రోజున ఎల్లమ్మ గుడి వద్ద నిర్వహించిన పట్నాల్లో పంబాల పూజారులు ఎల్లమ్మ దేవత జీవిత చరిత్ర గురించి కథ చెప్పారు. అనంతరం భక్తులు గుడిలో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లగొండ తిరుపతి గౌడ్, నియోజకవర్గ ఇన్చార్జి గోపగోని నవీన్ గౌడ్, స్థానిక సర్పంచ్ బుర్ర శ్రీదర్ గౌడ్, వేగురుపల్లి సర్పంచ్ పడాల సతీష్ గౌడ్, గౌడ సంఘ గ్రామాధ్యక్షుడు కెక్కర్ల వెంకటేశం గౌడ్, ఉపాధ్యక్షుడు గోపగోని నరేందర్ గౌడ్,సంఘ సభ్యులు గ్రామ ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో ఎల్లమ్మ పట్నాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# జర్నలిస్టు కూరాకుల గోపి గుండెపోటుతో మృతి



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి, 'జనంసాక్షి' పత్రిక బ్యూరో ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపి మంగళవారం గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు.మంగళవారం ఉదయం ఛాతీలో నొప్పి రావడంతో తీవ్రంగా బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 54 సంవత్సరాలు. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గోపి ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు,రెవెన్యూ, గృహ నిర్మాణం శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపి మరణవార్త తెలుసుకున్న మంత్రి పొంగులేటి తీవ్ర విచారాన్ని వ్యక్తపరుస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిజం రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గోపి మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు సద్గతులు కలగాలని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జర్నలిస్టు గోపి కుటుంబానికి తాము అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి కూరాకుల గోపి ఆకస్మిక మృతి పట్ల ఆ యూనియన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గోపి మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, టీబీజేఏ నగర అధ్యక్షుడు వీఎమ్మార్ వెంకట్, సహాయ కార్యదర్శి చెన్నంశెట్టి రాంబాబు తదితరులు గోపి భౌతిక కాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# ఆటో డ్రైవర్లకు ఉచితంగా రూ.10 లక్షల పోస్టాఫీస్ ప్రమాద బీమా పాలసీల పంపిణీ

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ దంసలా పురం - సీతారాంపురం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం "లైఫ్ టైమ్ ఫ్రెండ్స్" టీం ఆధ్వర్యంలో భారత తపాలా శాఖ ద్వారా అందిస్తున్న రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పాలసీలను ఉచితంగా అందించే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న వెంటనే 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, 21వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆళ్ళ నిరీషా అంజిరెడ్డి స్వయంగా హాజరై నిర్వాహకులను అభినందించారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఎంత ఖర్చు అయినా వెనుకాడబోమని, అవసరమైతే ఆర్థిక సహాయం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఐదు లక్షల బీమా కాదు, ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీ అందేలా కృషి చేయాలని సూచించారు. ఖమ్మం నగరంలోని అన్ని ఆటో డ్రైవర్ లు ఈ బీమా పథకాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్ వి. వీరభద్రస్వామి మాట్లాడుతూ, పోస్టాఫీస్ ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదాల్లో మరణించిన అనేక మంది పాలసీదారుల కుటుంబాలకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు బీమా పరిహారం అందించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.549 ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ పథకంలో ప్రమాద మరణంతో పాటు శాశ్వత అంగవైకల్యం, పాక్షిక అంగవైకల్యం వంటి సందర్భాల్లో ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రమాదాల వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందాల్సి వచ్చినప్పుడు రూ.1 లక్ష వరకు వైద్య ఖర్చుల సహాయం అందుతుందని వివరించారు. 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని, ఆసక్తి గల వారు సమీప పోస్టాఫీస్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లైఫ్ టైమ్ ఫ్రెండ్స్ టీం సభ్యులు తుమ్మ అప్పిరెడ్డి, అమర్లపూడి ప్రకాశ్, బాల శౌరి, చెరుకూరి కోటేశ్వరరావు (తంబి), డీకార్స్ టీం సభ్యులు పాల్గొని ఆటో డ్రైవర్లకు బీమా పథకం ప్రయోజనాలను వివరించారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు





భద్రత కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ అధికారులు, లైఫ్ టైమ్ ఫ్రెండ్స్ టీం సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఆటో యూనియన్ నాయకులు, స్థానిక ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# బాసర ట్రిపుల్ ఐటీకి ముగ్గురు ఆదర్శ విద్యార్థుల ఎంపిక



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** కాటారం మండలకేంద్రంలోని ఆదర్శ హైస్కూల్ ముగ్గురు విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను నిరూపిస్తూ ట్రిపుల్ ఐటీ బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ లో సీట్లు సాధించారు. ఇటీవల పదో తరగతి లో ఎ.మనోజ్ఞ 590, ఎం.గౌతమ్ కృష్ణ 582, ఎ.ఆరాధ్య 577 మార్కులు సాధించడంతో పాటు ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ బాసరలో ఆరేళ్ల సమగ్ర బీటెక్ కోర్సులో ప్రవేశాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ముగ్గురు విద్యార్థులను ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు లు అభినందించి శాలువాతో సన్మానించారు. పదవ తరగతిలో జిల్లా టాపర్ గా నిలవడంతో పాటు బాసర ట్రిపుల్ ఐటీ లో ముగ్గురు విద్యార్థుల సీటు సాధించడం ఈ ప్రాంతానికే గర్వకారణం అని ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ కరుణాకర్ రావు అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే ఆదర్శ హైస్కూల్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా ఉత్తమ విద్య, పోటీ పరీక్షలపై శిక్షణ ఇవ్వడం వల్లే వరుస విజయాలు సాధ్యమవుతున్నాయని అన్నారు.

# అందుకే పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలట.. ఎన్ని లాభాలో

చాలా మంది మహిళలు ప్రతి నెలా పీరియడ్స్ టైంలో భరించలేని కడుపు నొప్పిని అనుభవిస్తుంటారు. దీనివల్ల ఆఫీస్‌కు వెళ్లడం కష్టంగా మారుతుంది. కడుపు నొప్పి, తిమ్మిర్లు, ఉబ్బరం కారణంగా ఏమీ తినాలని అనిపించదు. చాలా అసౌకర్యంగా ఉంటుంది. మీకు కూడా ఇలాంటి రోజుల్లో సమస్యలు తలెత్తితే ఈ కింది జాగ్రత్తలు తీసుకోండి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పీరియడ్స్ సమయంలో వచ్చే సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఐరన్ అధికంగా ఉండే బెల్లం సర్వరోగనివారిణి పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలి. ఇది కడుపు నొప్పి నుంచి తక్షణ ఉపశమనం ఇచ్చి, శక్తిని ఇస్తుంది. బెల్లంలో చాలా ఎక్కువ మొత్తంలో ఐరన్ లభిస్తుంది. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తిని అందుతుంది. ఇది పీరియడ్స్ సమయంలో రక్త నష్టాన్ని కూడా భర్తీ చేస్తుంది. బెల్లం ఉపయోగం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరి నుంచి ఉపశమనం అందిస్తుంది. అలాగే రక్తం కొరత ఉండదు. దీనితో పాటు పీరియడ్స్ సమయంలో ఐరన్ పుష్కలంగా ఉండే పాలకూర, దానిమ్మ, బీట్‌రూట్ వంటి వాటిని కూడా తీసుకోవాలి. బెల్లం తినడం వల్ల కడుపునొప్పి నుంచి తక్షణ ఉపశమనం లభించి, నొప్పిని కూడా తగ్గిస్తుంది. బెల్లంలోని మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు కండరాలను రిలాక్స్ చేసి, తిమ్మిరి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. మానసిక స్థితిని మెరుగుదల పీరియడ్స్ సమయంలో బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. చిరాకు తగ్గుతుంది. బెల్లం వాడకం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్లు పెరుగుతాయి. దీని కారణంగా ఎక్కువ రిలాక్స్‌గా ఉంటారు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది చాలా మంది మహిళలు పీరియడ్స్ సమయంలో మలబద్ధకం, ఉబ్బరం సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. పీరియడ్స్



సమయంలో బెల్లం తప్పనిసరిగా తీసుకోవాలి. ఎందుకంటే ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. పీరియడ్స్ సమయంలో హార్మోన్లలో మార్పుల కారణంగా మానసిక అస్థిరత ఏర్పడుతుంది. బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. పోషకాహార నిపుణులు ప్రకారం.. పీరియడ్స్ ప్రారంభానికి 4 నుంచి 5 రోజుల ముందు నుంచే.. బెల్లం తీసుకోవడం ప్రారంభించాలి.

# మీ చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు ముఖ సౌందర్యం పెరగాలంటే.. రోజూ ఈ పండ్లను తినాలి..!

చర్మం మృదువుగా,తేమగా ఉండడంతోపాటు సురక్షితంగా ఉండాలని, కాంతివంతంగా మారి మెరవాలని చాలా మంది కోరుకుం టుంటారు. అందులో భాగంగానే చర్మ సంరక్షణకు అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్ చికిత్సలను తీసుకుంటారు. ఇంకా కొందరు ఇంట్లోనే పలు చిట్కాలను పాటిస్తుంటారు. అయితే చర్మ సౌందర్యం, సంరక్షణ కోసం ఆయా చికిత్సలను, చిట్కాలను పాటించడం సరైందే అయినప్పటికీ ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మనం తినే ఆహారం సరిగ్గా ఉంటేనే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మ సంరక్షణకు ఆహారం కూడా చాలా ముఖ్యమైందే అన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఈ క్రమంలోనే పలు రకాల పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఇక ఆ పండ్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. **బెర్రీలు, సిట్రస్ ఫలాలు..** స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్ బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇవి చర్మాన్ని దృఢంగా మార్చి యవ్వనంగా ఉండేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఫ్రీ ర్యాడికల్స్ తొలగిపోతాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకోవచ్చు. చర్మం మృదువుగా మారి కాంతివంతంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లను కూడా తింటుండాలి. ఈ పండ్లలోనూ విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లను తింటుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే నల్లని మచ్చలు, మొటిమలు తొలగిపోతాయి. చర్మం సురక్షితంగా ఉంటుంది. **బొప్పాయి పండ్లు..** బొప్పాయి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లు మన చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియేటింగ్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. బొప్పాయి పండ్లలో ఉండే వటమిన్లు ఎ, సి, ఇ వల్ల మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. నల్లని మచ్చలు తొలగిపోతాయి. బొప్పాయిలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాల వల్ల చర్మ వాపులు తగ్గిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో పాలిఫినాల్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగాకనిపిస్తారు. ముఖసౌందర్యం పెరుగుతుంది. **అరటి పండ్లు..** అరటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందిస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు ఎ, బి, ఇ అధికంగా ఉంటాయి. కనుక అరటి పండ్లను తింటే పొడి చర్మం ఉన్నవారికి మేలు జరుగుతుంది. అరటి పండ్లను ఫేస్ ప్యాక్‌గా కూడా ఉపయోగించవచ్చు. దీంతో ముఖానికి కావల్సిన తేమ, మృదుత్వం లభిస్తాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. పుచ్చకాయలు, కీరదోసలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే వీటిని తరచూ తింటుండాలి. అదేవిధంగా ద్రాక్ష పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని సూర్య కిరణాల బారి నుంచి రక్షిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా ఆయా పండ్లను రోజూ తింటుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు రాకుండా యవ్వనంగా ఉంటారు.

# మీకు డయాబెటిస్ ఉందా..?

## రోజుకు రెండుసార్లు ఇలాంటి టీ తాగండి చాలు..!



పాలు, చక్కెర కలిపి తయారు చేసిన టీ తాగటం మానేస్తే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్న మాట. కానీ, డయాబెటిక్ పేషెంట్లు టీ ఎలా తాగాలో ప్రత్యేకించి చెబుతున్నారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు తమ డైట్ విషయంలో ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. షుగర్ లెవల్స్ మెయింటెయిన్ చేయడం తప్పనిసరి అంటున్నారు. షుగర్ బాధితులు దూరంగా ఉండాల్సిన ఆహారాల్లో టీ కూడా ఒకటి. ఇందులో పాలు, పంచదార ఉన్నందున దీనిని నివారించడం మంచిదని చెబుతున్నారు.. కానీ, డయాబెటిక్ పేషెంట్లు ఎలాంటి టీ తాగితే మేలు చేస్తుందో ఇక్కడ తెలుసుకుందాం.. 1. గ్రీన్ టీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు అత్యంత ఆరోగ్యకరమైన టీలలో గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీలోనిపాలీఫెనాల్స్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. అంతే కాదు, గ్రీన్ టీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. 2.దాల్చిన చెక్క టీ దాల్చిన చెక్క టీ మధుమేహాన్ని నియంత్రించడంలో ఉత్తమమైనది. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దాల్చిన చెక్క టీ చేయడానికి, ఒక కప్పు నీటిలో దాల్చిన చెక్క చిన్న ముక్క వేసి కాసేపు మరగనివ్వాలి. ఆ తర్వాత టీకి బదులుగా తాగేయాలి. 3. మెంతి టీ డయాబెటిక్ బాధితులకు మెంతి టీ మరొక గొప్ప ఎంపిక. మెంతులలో ఫైబర్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర శోషణను తగ్గిస్తుంది. మెంతి టీ చేయడానికి, ఒక కప్పు వేడి నీటిలో ఒక చెంచా మెంతులు వేసి 10 నిమిషాలు అలాగే పక్కన పెట్టి తాగేయండి. రుచి కోసం కావాలంటే మీరు నిమ్మరసం కూడా యాడ్ చేసుకోవచ్చు. 4. వాముతో తయారు చేసిన టీ వాము జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. వాము టీ తయారు చేయడానికి ఒక గ్లాస్ నీటిలో పావు చెంచా వాము వేసి 5 నిమిషాలు మరిగించండి. కాస్త ఆ తర్వాత వడకట్టి తాగాలి. 5. తులసి టీ తులసి టీలో యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. తులసి ఆకులు హైపోగ్లైసీమిక్ ప్రభావాలను కలిగి ఉన్నాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది. దీని కోసం, ఒక కప్పు వేడి నీటిలో కొన్ని తులసి ఆకులను వేసి 5 నిమిషాలు మూత పెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత రుచి కోసం కొంచెం తేనె కలుపుకుని తాగేయొచ్చు. చివరగా, మధుమేహులు ఇలాంటి టీ తాగుతున్నప్పుడు దానికి చక్కెర, లేదా తేనె కలుపుకోవడం మంచిదికాదు. రుచి కోసం కావాలంటే మీరు దాల్చినచెక్క పొడి లేదా ఏలకుల పొడి వేసుకుని తాగొచ్చు. మరీ ముఖ్యంగా ఇలాంటి ఇంటి చిట్కాలు, ఆయుర్వేద మందులు వాడే ముందు..మీరు మీ వైద్యుడిని సంప్రదించండి. దీనితో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, వైద్యుల సలహాలను అనుసరించడం చాలా ముఖ్యం.

# గుండె సమస్యలకు దానిమ్మ రసం దివ్యౌషధం..

## రోజుకి గ్లాసుడు తాగితే చాలు!



ఫైబర్, విటమిన్లు, ఖనిజాలతో నిండిన దానిమ్మ పండు శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున్న శరీర కణాలను రక్షించడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. ఇది దీర్ఘకాలిక మంటను తగ్గించడంలో, టైప్-2 మధుమేహం వంటి వ్యాధులను నివారించడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు వ్యతిరేకంగా ప్రతిఘటించే సామర్థ్యం దానిమ్మపండులోని కొన్ని భాగాల్లో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దానిమ్మపండులో పాలీఫెనోలిక్ అనే ప్రయోజనకరమైన సమ్మేళనం ఉంటుంది. ఈ పండు గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. దానిమ్మ రసం తాగితే ఛాతీ నొప్పి తీవ్రత తగ్గుతుందని నిపుణులు అంటున్నారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా దానిమ్మ రసం నివారిస్తుంది. అందుకే ఈ జ్యూస్‌ని రెగ్యులర్‌గా తాగితే కిడ్నీలు బాగుంటాయని నిపుణులు సూచిస్తుంటారు. దానిమ్మ రసం నోటి దుర్వాసనను తగ్గిస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించడం ద్వారా దంత క్షయాన్ని నివారిస్తుంది. క్రమం తప్పకుండా దానిమ్మ రసాన్ని తింటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దానితో పాటు ప్రేగులలో ఉండే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా సంఖ్య కూడా పెరుగుతుంది. ఫలితంగా గ్యాస్-గుండె మంట సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. దానిమ్మలో ఉండే ఎల్లాగిటానిన్ అనే యాంటీఆక్సిడెంట్ అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులను నివారించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తుంది.



# రాత్రి పూట మీరు తినే ఆహారంలో వీటిని చేర్చుకోండి.. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు..

అధికంగా బరువు ఉన్నవారు రాత్రి పూట భోజనాన్ని త్వరగా ముగిస్తుంటారు. రాత్రి పూట తినే ఆహారంలో చపాతీలను చేర్చుకుంటారు. అంతే కాదు రాత్రి పూట ఆహారాన్ని తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం పట్ల అనేక జాగ్రత్తలను పాటిస్తుంటారు. అయితే బరువు తగ్గాలంటే పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. సరైన పోషకాలు ఉండే ఆహారాలను తింటే బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ క్రమంలోనే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గుతారు. పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉండే కూరగాయలను రాత్రి పూట తినాల్సి ఉంటుంది. పాలకూర, బ్రోకలీ, కాలిఫ్లవర్, మొలకలు, క్యాప్సికం, పుట్ట గొడుగులు, గ్రీన్ బీన్స్ వంటి ఆహారాలను రాత్రి పూట తింటుంటే మేలు జరుగుతుంది. కినోవా, బ్రౌన్ రైస్.. సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. కినోవా, బ్రౌన్ రైస్, చిలగడదుంపలు వంటి వాటిల్లో సంక్లిమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్‌గా మారేందుకు సమయం పడుతుంది. పైగా వీటిని కాస్త తిన్నా చాలు, వీటిల్లో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను కూడా రాత్రి పూట తినవచ్చు. అవకాడో, బాదంపప్పు, వాల్ నట్స్, చియా సీడ్స్‌ను రాత్రి పూట తినవచ్చు. అలాగే ఆలివ్ ఆయిల్‌ను కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ రాత్రి పూట తీసుకోదగిన ఆహారాలు. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ కాంబినేషన్ ట్రై చేయండి.. రాత్రిపూట ఆహారంలో చేపలను, కూరగాయలను కలిపి కాంబినేషన్‌లో తినవచ్చు. లేదా చికెన్, వెజిటబుల్ సలాడ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్, వెజిటబుల్ సూప్‌ను కలిపి తీసుకోవచ్చు. సోయా టోఫు, కూరగాయలను కలిపి కూడా తినవచ్చు. ఇలా రాత్రి పూట భోజనాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను తిన్నప్పటికీ వీటిని రాత్రి పూట తక్కువ మోతాదులోనే తినాలి. ఇతర ఆహారాలతో పోలిస్తే ఇవి బరువు తగ్గేందుకు మనకు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తినకూడదు. ఇక రాత్రి పూట భోజనాన్ని వీలైనంత త్వరగా తినేయాల్సి ఉంటుంది. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 2 నుంచి 3 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. చక్కెర ఉండే ఆహారాలు, ప్రాసెస్ ఫుడ్స్, శీతల పానీయాలను తాగకూడదు. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే అధిక బరువును చాలా తేలిగ్గా తగ్గించుకోవచ్చు.

# శుభ్‌మన్ గిల్ బెస్ట్ కెప్టెన్

స్పోర్ట్స్

## అశ్విన్ బెస్ట్ టీమ్ అనౌన్స్ మెంట్

ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత క్రికెట్ లవర్స్ ను ఆకట్టుకునేలా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఒక క్రేజీ అనౌన్స్ మెంట్ చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్ లో ఈ సీజన్ కు సంబంధించిన బెస్ట్ ప్లేయింగ్ 12 టీమ్ ను సెలెక్ట్ చేశాడు. ఈ లిస్టులో ఎవరూ ఊహించని విధంగా గుజరాత్ టైటాన్స్ (+u) కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ను తన టీమ్ కు కెప్టెన్ గా అనౌన్స్ చేశాడు. ఈ సీజన్ మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డు విన్నర్, 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని ఫస్ట్ ఓపెనర్ గా ఎంచుకున్నాడు. వైభవ్ ఈ టోర్నమెంట్ లో 16 మ్యాచుల్లో 237 కి పైగా స్ట్రైక్ రేట్ తో 776 రన్స్ చేసి హయ్యెస్ట్ రన్ స్కోరర్ గా నిలిచాడు. అశ్విన్ టీమ్ లో సెకండ్ ఓపెనర్ గా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నిలిచాడు. గిల్ ఈ సీజన్ లో 46 యావరేజ్, 163.02 స్ట్రైక్ రేట్ తో 732 రన్స్ స్కోర్ చేశాడు. ఇక ఈ సీజన్ ఫైనల్ మ్యాచ్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) లెజెండ్ విరాట్ కోహ్లీని నంబర్ 3 పొజిషన్ కు పరిమితం చేశాడు. కోహ్లీ ఈ టోర్నీ అంతటా ఓపెనర్ గా ఆడినప్పటికీ అశ్విన్ మాత్రం అతడిని వన్ డౌన్ లో బ్యాటింగ్ కు దించాడు. విరాట్ కోహ్లీ ఈ సీజన్ లో 56.25 అద్భుతమైన యావరేజ్ తో




675 రన్స్ చేసి తన క్లాస్ పర్ఫార్మెన్స్ ను చూపించాడు. నంబర్ 4 ప్లేస్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ఎ) స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ను సెలెక్ట్ చేశాడు. క్లాసెన్ ఈ సీజన్ లో 48 యావరేజ్ తో 624 రన్స్ చేశాడు. నంబర్ 5 లో ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ ను ఎంచుకున్నాడు. పాటిదార్ 192.69 స్ట్రైక్ రేట్ తో 500 కి పైగా రన్స్ తో విధ్వంసం సృష్టించాడు. నంబర్ 6 ను ఎస్‌ఆర్‌హెచ్ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని కేటాయించాడు. నితీష్ 14 మ్యాచుల్లో 300 రన్స్ తో పాటు 8 వికెట్లు తీసి టీమ్ కు మంచి బ్యాలెన్స్ ఇచ్చాడు. నంబర్ 7 లో ఆర్‌సీబీ ఆల్ రౌండర్ కృనాల్ పాండ్యాని ఎంపిక చేశాడు. కృనాల్ 16 మ్యాచుల్లో 226 రన్స్ తో పాటు 14 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కోసం అశ్విన్ ముగ్గురు ఫారెన్ ప్లేయర్లను లైన్ లోకి తెచ్చాడు. సీఎస్కే బౌలర్ జేమీ ఓవర్టన్ (14 వికెట్లు), కేకేఆర్ స్పిన్నర్ సునీల్ నరైన్ (15 వికెట్లు, 6.64 ఎకానమీ) లతో పాటు ఈ సీజన్ పర్పుల్ క్యాప్ విన్నర్ కాగిసో రబాడ (29 వికెట్లు) ను మెయిన్ పేసర్ గా తీసుకున్నాడు. వీరితో పాటు ఆర్‌సీబీ స్పియర్ హెడ్ భువనేశ్వర్ కుమార్ ను ఎంచుకున్నాడు. భువి 16 మ్యాచుల్లో 7.95 ఎకానమీతో 28 వికెట్లు తీసి సంచలనం సృష్టించాడు.

## నేనో కెప్ట్ బాయ్‌ఫ్రెండ్‌ని: లలిత్ మోదీ

సుస్మితా సేన్‌పై చాలా కాలంగా వస్తున్న రూమర్స్‌కి లలిత్ మోదీ ఎట్టకేలకు చెక్ పెట్టాడు. 2022లో సుస్మితా సేన్ – లలిత్ మోదీ రిలేషన్‌లో ఉన్నారు. అయితే, కేవలం డబ్బు కోసమే సుస్మితా సేన్ లలిత్ మోదీతో రిలేషన్‌లో ఉందని విమర్శలు వచ్చాయి. వాటన్నింటికీ చెక్ పెడుతూ సుస్మితా సేన్‌కు డబ్బు అవసరం లేదని, తాను చాలా సంపన్నురాలని మోదీ అన్నాడు. నిజం చెప్పాలంటే బయటకు వెళ్లినప్పుడు తానే ఖర్చు పెడుతుందని బయటపెట్టాడు. సంచలనాలతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ మరోసారి నెట్టింట హాట్ టాపిక్ అయ్యాడు. ఈ సారి తన మాజీ ప్రేయసి సుస్మితా సేన్ గురించి విషయాలను బయటపెట్టి అందరికీ షాక్ ఇచ్చాడు. లలిత్ మోదీ – సుస్మితా సేన్ రిలేషన్‌లో ఉన్నప్పుడు నెట్టింట ఎన్నో రూమర్స్ వచ్చాయి. ముఖ్యంగా సుస్మితా సేన్ డైమండ్ క్వీన్, గోల్డ్ డిగ్గర్ అంటూ కామెంట్స్ చేశారు. వాటన్నింటిని ఖండిస్తూ లలిత్ మోదీ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సుస్మితా సేన్ – లలిత్ మోదీ సన్నిహితంగా ఉన్న ఫొటోలు 2022 జూలైలో నెట్టింట వైరల్ అయ్యాయి. అప్పట్లో తామిద్దరం ప్రేమలో ఉన్నామని లలిత్ మోదీనే ప్రకటించడంతో అందరూ సుస్మితా సేన్‌పై గోల్డ్ డిగ్గర్ అంటూ విమర్శలు చేశారు. అప్పట్లో వచ్చిన విమర్శలను లలిత్ మోదీ ఇప్పుడు ఖండించాడు. సుస్మితా ఎవరి దగ్గర నుంచి ఏదీ స్వీకరించే వ్యక్తి కాదని, ఇద్దరూ కలిసి బయటకు వెళ్లినప్పుడు తానే ఖర్చు పెట్టేదంటూ హ్యూమన్స్ ఆఫ్ బాంబేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో బయటపెట్టాడు. “సుస్మితా సేన్ అందమైన మహిళే కాదు.. చాలా సంపన్నురాలు కూడా. ప్రపంచంలో నాకు తెలిసిన వారిలో అత్యధిక వజ్రాలు కలిగిన వ్యక్తి కూడా ఆమె అయ్యుంటుంది అనుకుంటున్నాను. అవన్నీ ఆమె సంపాదించుకున్నవే. ఆమెకు డైమండ్ స్టోర్లు కూడా ఉన్నాయి. మేమిద్దరం కలిసి బయటకు వెళ్లినప్పుడు ఒక్కసారి కూడా నేను ఖర్చు పెట్టాల్సిన అవసరం రాలేదు. ప్రతీదానికీ ఆమే ఖర్చు పెడుతుంది. నిజానికి నేనే కెప్ట్ బాయ్‌ఫ్రెండ్‌లా ఉండేవాడిని. ఎవరైనా ఆమెను గోల్డ్ డిగ్గర్ అంటుంటే అది పూర్తిగా అవాస్తవం. నిజానికి నేను ఆమె విషయంలో డైమండ్ డిగ్గర్‌ని ఎందుకంటే ఆమె నిజంగానే ఒక డైమండ్ లాంటి వ్యక్తి. డబ్బు కోసం ఆమె నాతో రిలేషన్‌లో లేదు. ఆమెకు కావాలంటే ప్రపంచంలో ఎవ్వరినైనా ఎంచుకునే స్తోమత ఉంది. ఆర్థికంగా చాలా బలమైన మహిళ.. ఎవరి నుంచి ఏదీ స్వీకరించేది కాదు” అని అసలు నిజాన్ని లలిత్ మోదీ బయటపెట్టాడు. లలిత్ మోదీ 2022లో సుస్మితాను తన బెటర్ హాఫ్‌గా పేర్కొనడంతో ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని అందరూ అనుకున్నారు. కానీ కేవలం డేటింగ్ మాత్రమే చేస్తున్నామని అప్పట్లో ఆయన స్పష్టం చేశాడు. సుస్మితా సేన్‌తో బ్రేకప్ తర్వాత లలిత్ మోదీ ఇప్పుడు లెబనాన్‌కు చెందిన రీమా బౌరీతో రిలేషన్‌లో ఉన్నాడు. 2025 ప్రేమికుల దినోత్సవం రోజున వీరిద్దరి రిలేషన్‌ను బయటపెట్టారు.




## కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం!?

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జరగబోయే ప్రతిష్టాత్మక ఐసీసీ వన్డే ప్రపంచకప్ 2027తో పాటు బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ, యాషెస్ సిరీస్ లాంటి బిజీ షెడ్యూల్ ఆస్ట్రేలియాకు ఉండటంతో, పనిభారం తగ్గించుకునేందుకు ఐపీఎల్‌కు బ్రేక్ ఇవ్వనున్నట్లు కమిన్స్ హింట్ ఇచ్చాడు. ఒకవేళ కమిన్స్ దూరమైతే, ఐపీఎల్ 2026లో తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించిన ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులను ఆందోళన కలిగించే వార్త ఒకటి వెలుగులోకి వచ్చింది. జట్టు కెప్టెన్, స్టార్ పేసర్ ప్యాట్ కమిన్స్ .. ఐపీఎల్ 2027 సీజన్‌కు దూరం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై అతడి స్వయంగా హింట్ ఇచ్చాడు. భవిష్యత్‌తో అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉందని.. దీంతో పనిభారం దృష్ట్యా.. ఐపీఎల్ 2027కు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు.కాగా ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు.. వచ్చే 18 నెలలు కీలకం కానుంది. ఈ గ్యాప్‌లో ఆస్ట్రేలియా జట్టు.. ప్రతిష్టాత్మకమైన యాషెస్ సిరీస్, భారత్‌లో బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ, ఆ తర్వాత వన్డే ప్రపంచకప్ 2027 ఆడాల్సి ఉంది. ఒకవేళ పాయింట్ల పట్టికలో టాప్–2లో నిలిస్తే.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కూడా ఆడాల్సి రావచ్చు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ప్యాట్ కమిన్స్.. ఈ టోర్నీలు అన్నింట్లో ఆడాలని భావిస్తున్నాడు. దీంతో అవసరమైతే ఐపీఎల్ 2027కు దూరమయ్యేందుకు సిద్ధమయ్యాడు. “వచ్చే ఏడాది ఏదో ఒక దశలో నేను కచ్చితంగా ఒక టోర్నీకి దూరం కావాల్సి ఉంటుంది. అయితే అది దేశం తరఫున ఆడే టెస్ట్ మ్యాచ్‌లు లేదా వన్డే ప్రపంచకప్ మాత్రం కాదు. సమయం వచ్చినప్పుడు నేను నా ఐపీఎల్ ఫ్రాంచైజీ (సన్‌రైజర్స్ హైదరాబాద్)తో మాట్లాడి సరైన నిర్ణయం తీసుకుంటాను. ప్రస్తుతానికైతే దీనిపై నేను ఇంతకంటే ఎక్కువ క్లారిటీ ఇవ్వలేను. ఎందుకంటే పరిస్థితులు మారవచ్చు లేదా గాయాలు కూడా కావచ్చు” అని పత్రికతో మాట్లాడుతూ కమిన్స్ వ్యాఖ్యానించాడు. కాగా ఐపీఎల్ 2026లో కొన్ని మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. దీంతో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు సారథిగా ఇషాన్ కిషన్ వ్యవహరించాడు. కమిన్స్ వచ్చాక అతడే సారథ్య పగ్గాలు చేపట్టాడు. ఈ సీజన్‌లో సన్ రైజర్స్ టాప్–4లో నిలిచింది. అయితే ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడి.. టోర్నీ నుంచి నిష్క్రమించింది. వచ్చే సీజన్‌లో కమిన్స్ అందుబాటులో లేకపోతే.. ఇషాన్ కిషన్ పూర్తిస్థాయి సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

## వచ్చే ఏడాది మార్చి 15 నుంచే ఐపీఎల్?

వచ్చే ఏడాది నుంచి ఐపీఎల్? షెడ్యూల్? మారనుందా? మార్చి 15 నుంచే టోర్నీ మొదలుకానుందా? మ్యాచ్?ల సంఖ్య కూడా భారీగా పెరగనుందా? మీడియాలో వస్తున్న ఈ వార్తలపై బీసీసీఐ బోర్డు కార్యదర్శి దేవజిత్? సైకియా తాజాగా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఐపీఎల్? విండో మార్పు గురించి పెద్దగా ఆలోచించడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీసీఐ ఐపీఎల్? మ్యాచ్?లకు, ప్రేక్షకులకు ఇబ్బంది కలిగిస్తున్న వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడంపై మాత్రమే దృష్టి పెట్టిందని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండలు, వర్షాల వల్ల మ్యాచ్?లకు అంతరాయం కలగకుండా వచ్చే సీజన్? నుంచి టోర్నమెంట్?ను రెండు వారాల ముందే ప్రారంభించే అవకాశం ఉందని తెలిపారు. ఈ ఏడాది (2026) ఐపీఎల్? మార్చి 28న ప్రారంభం కాగా, కొన్ని మ్యాచ్?లపై వర్షం ప్రభావం పడింది. ముఖ్యంగా కోల్?కతా నైట్? రైడర్స్? వర్సెస్? పంజాబ్? కింగ్స్? మధ్య జరగాల్సిన ఒక మ్యాచ్ ఫలితం తేలకుండానే? వర్షార్పణం అయ్యింది. మరోవైపు వేసవి ఎండల తీవ్రత వల్ల మైదానంలోని ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు చాలా ఇబ్బందులు పడ్డారు. టోర్నమెంట్ జరిగే సమయంలో ఇలా వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోవడంపై బీసీసీఐ ఆందోళన చెందుతోంది. ఓ ప్రముఖ మీడియాతో బీసీసీఐ బోర్డు మెంబర్? దేవజిత్ సైకియా మాట్లాడుతూ, ఐపీఎల్ మ్యాచ్?ల సంఖ్యను 74 నుంచి 94కు పెంచుతారనే ప్రచారాన్ని కొట్టిపారేశారు. “బీసీసీఐ ఈ అంశాన్ని అంత సీరియస్?గా తీసుకోవడం లేదు. ఎందుకంటే, గతంలో లాగానే ఈ ఏడాది కూడా ఐపీఎల్ రెండు నెలల కంటే ఎక్కువ కాలం సాగింది. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే, ఈ ఏడాది 2 నెలల 2 రోజులపాటు టోర్నమెంట్?





జరిగింది. అయితే ప్రస్తుతం బీసీసీఐ బోర్డు మ్యాచ్?ల సంఖ్య కంటే, వాతావరణ పరిస్థితులపైనే ప్రధానంగా దృష్టి సారించింది” అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు. ‘గతేడాది ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత,? మధ్యలో ఒక వారం పాటు టోర్నమింట్?ను నిలిపివేశారు. దీనితో లీగ్? కొద్దిగా పొడిగించబడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మాకు ఉన్న ఆందోళన ఏమిటంటే, టోర్నమెంట్? మే 31 వరకు సాగితే, వర్షాల వల్ల కొన్ని మ్యాచ్?లపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరికొన్ని మ్యాచ్?లపై ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉండే ఛాన్సుంది’ అని ? దేవజిత్ సైకియా అభిప్రాయపడ్డారు. తీవ్రమైన ఎండలు, ముందస్తు వర్షాల (ప్రీ–మాన్?సూన్) ప్రభావం పడకుండా ఉండడం కోసం ఐపీఎల్? షెడ్యూల్?ను కాస్త ముందుకు జరిపి, మే నెల మధ్య నాటికే టోర్నమెంట్?ను ముగించే అవకాశాలను బీసీసీఐ పరిశీలిస్తోందని సైకియా స్పష్టం చేశారు. “మేము ఐపీఎల్?ను మరో 15 రోజులు ముందుకు తీసుకువచ్చే మార్గాలను అన్వేషిస్తున్నాం. ఈ ఏడాది మేము మార్చి 28న టోర్నీని ప్రారంభించాం. కానీ వచ్చే సీజన్? నుంచి కాస్త ముందుగా, అంటే బహుశా మార్చి 15 నాటికే ఐపీఎల్?ను ప్రారంభించడానికి ప్రయత్నిస్తున్నాం. మేము ఇప్పటికే దీనిపై కసరత్తు ప్రారంభించాం. మే 15 కల్లా టోర్నమెంట్?ను ముగించాలని చూస్తున్నాం. దీని వల్ల వేడి వాతావరణం లేదా వర్షాల ప్రభావం అటు ఆటగాళ్లపై, ఇటు స్టేడియానికి వచ్చే వీక్షకులపై, అభిమానులపై పడకుండా ఉంటుంది” అని సైజికా పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐపీఎల్? మ్యాచ్?ల సంఖ్య పెంచుతారా, లేదా? అనే ప్రశ్నకు సైకియా తనదైన రీతిలో సమాధానం చెప్పారు. ఐపీఎల్? మ్యాచ్?ల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలన్నా, అది పూర్తిగా అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్?, ఫ్యూచర్? టూర్స్ ప్రోగ్రామ్? (ఎఫ్?టీపీ) నిబంధనలపై ఆధారపడి ఉంటుందని సైకియా స్పష్టం చేశారు. కాబట్టి మేము దీనిపై పని చేస్తున్నాం. కానీ మ్యాచ్?లను 74 నుంచి 94కి పెంచే విషయాన్ని ప్రస్తుతానికి అంత సీరియస్?గా తీసుకుంటున్నామని చెప్పలేను. ఎందుకంటే ఇందులో అనేక ఇతర అంశాలు ముడిపడి ఉన్నాయి. ఐసీసీ నిర్వహించే వివిధ ఎఫ్?టీపీలు, ద్వైపాక్షిక సిరీస్?లు, మల్టీనేషనల్? టోర్నమెంట్?లను కూడా మేము పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల మ్యాచ్?లు పెంచడంపై ప్రస్తుతానికి ఎలాంటి తక్షణ చర్యలు తీసుకోవడం లేదు. అయితే 2027 తర్వాత పరిస్థితులు ఎలా మారతాయో చూద్దాం. అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుంది” అని దేవజిత్ సైకియా అన్నారు.




## భారత్, న్యూజిలాండ్ సిరీస్ షెడ్యూల్ ప్రకటన

**కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్**
**రోహిత్, విరాట్‌కు కీలకం కానున్న న్యూజిలాండ్ పర్యటన**
**న్యూజిలాండ్‌తో 12 మ్యాచ్‌లు ఆడనున్న భారత్**
**ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులు**
**అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ జరగనున్న సిరీస్**

టీమిండియా కోసం న్యూజిలాండ్ ఓ భారీ సిరీస్‌ను ప్లాన్ చేసింది. భారత్ – న్యూజిలాండ్ దేశాల మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కివీస్ ఈ టూర్ ప్లాన్ చేసింది. న్యూజిలాండ్ గడ్డపై 40 రోజుల పాటు క్రికెట్ అభిమానులకు ఓ పెద్ద పండగే అని చెప్పొచ్చు. ఐదు వన్డేలు, ఐదు టీ20లతో పాటు రెండు టెస్టులతో కలిపి మొత్తం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత్ – న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీమిండియా కోసం కివీస్ ఓ మెగా టూర్ ప్లాన్ చేసింది. ఏకంగా 40 రోజుల పాటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించేలా టెస్టు, టీ 20, వన్డేలతో ఓ మెగా సిరీస్‌నే సిద్ధం చేసింది. అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు న్యూజిలాండ్‌లో భారత జట్టు పర్యటించనుంది. ఈ టూర్‌లో ఐదు టీ20లు, రెండు టెస్టులతో పాటు ఐదు వన్డేల సిరీస్ కూడా ఉండటం విశేషం.న్యూజిలాండ్ ఇప్పటి వరకు ఆతిథ్యం ఇచ్చిన అతిపెద్ద ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా పర్యటన ఒకటిగా నిలవనుంది. అలాగే ఒకే పర్యటనలో ఓ విదేశీ జట్టుతో న్యూజిలాండ్ ఆడనున్న అత్యధిక మ్యాచ్‌ల సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. భారత్ – న్యూజిలాండ్ మధ్య క్రీడా సంబంధాలు ప్రారంభమై వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సిరీస్ నిర్వహించనున్నారు.భారత్ – న్యూజిలాండ్ మధ్య ఈ సిరీస్ అక్టోబర్ 22 నుంచి ప్రారంభం కానుంది. క్రైస్ట్ చర్చ్ వేదికగా అక్టోబర్ 22న తొలి టీ20 మ్యాచ్‌తో ఈ సిరీస్ ప్రారంభమవుతుంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ అనంతరం నవంబర్ 4 నుంచి ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా వన్డే సిరీస్ స్టార్ట్ అవుతుంది. ఆ తర్వాత నవంబర్ 19 నుంచి రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనున్నారు. నవంబర్ 19 నుంచి 23 వరకు వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్‌లో తొలి టెస్టు, నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1 వరకు క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో రెండో టెస్టు నిర్వహిస్తారు. భారత్ చివరిసారిగా 2019 – 20 సీజన్‌లో టెస్టు సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు వెళ్లింది. ఆ తర్వాత మళ్లీ న్యూజిలాండ్ రెండుసార్లు భారత్‌లో పర్యటించింది. ముఖ్యంగా 2024–25లో 3– 0తో క్లీన్ స్వీప్ చేసింది. రోహిత్, కోహ్లి టెస్టు రిటైర్మెంట్‌కు బీజం పడింది కూడా ఈ సిరీస్ నుంచే! అయితే కివీస్ గడ్డపై ఆరేళ్ల తర్వాత టీమ్ఇండియా టెస్టు సిరీస్? ఆడనుంది. 2019లో న్యూజిలాండ్?లో భారత్ చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడింది. ఇక 2022 తర్వాత ఆ దేశంలో భారత్ ఆడుతున్న తొలి వైట్ బాల్ సిరీస్ కూడా ఇదే కావడం విశేషం. 2022 నవంబర్?లో కివీస్?లో టీమ్ఇండియా వన్డే సిరీస్ ఆడింది. ఆ తర్వాత మళ్లీ ఈ పర్యటనతోనే కివీస్ గడ్డపై టీమ్ఇండియా ఆడనుంది. మరోవైపు స్టార్లు రోహిత్, విరాట్?కు తమ కెరీర్?లో ఇదే ఆఖరి న్యూజిలాండ్ పర్యటన అయ్యే అవకాశం ఉంది. టీ20, టెస్టులకు గుడ్?బై చెప్పేసిన ఈ స్టార్లు వన్డే ఫార్మాట్?లోనే ఆడుతున్నారు. వచ్చే ఏడాది వన్డే వరల్డ్?కప్?లో ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ఇద్దరికి తమతమ కెరీర్?లో మరోసారి న్యూజిలాండ్?లో ఆడే అవకాశం రాకపోవచ్చు!మరో మూడు రోజుల్లో టీమ్ఇండియా ఇంటర్నేషనల్ క్రికెట్?లో మళ్లీ సందడి చేయనుంది. భారత్ పర్యటనకు అఫ్గానిస్థాన్ రానుంది. ఈ టూర్?లో ఏకైక టెస్టు మ్యాచ్, మూడు వన్డేలు ఆడనుంది. జూన్ 06న టెస్టు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్?కు ముల్లాన్?పుర్ వేదిక కానుంది. ఆ తర్వాత జూన్ 13న ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. జూన్ 17న రెండో, 20న మూడో వన్డేలో అఫ్గాన్– భారత్ ఢీ కొట్టనున్నాయి.



# విశ్వజి



## ఒత్తిడి ఉపశమనం, ప్రశాంతమైన నిద్ర.. ఈ ఒక్కటి ట్రై చెయ్యండి!

వంటింట్లో వెల్లుల్లిని చాలా ప్రధానంగా భావిస్తాము. నిత్యం మనం చేసే వంటలలో కూడా వెల్లుల్లి పాత్ర చాలా ఉంటుంది. వెల్లుల్లిలో మన శరీరానికి ఆరోగ్యాన్నిచ్చే అనేక మంచి గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా వెల్లుల్లి నిద్రలేమి లక్షణాలను తగ్గించడంలో ఎంతగానో సహాయం చేస్తుంది. ఇటీవల జరిగిన అధ్యయనాలు వెల్లుల్లి యొక్క సహజ సమ్మేళనాలు నిద్ర నాణ్యతను మెరుగుపరచగలవని సూచిస్తున్నాయి. నిద్ర సమస్యలతో బాధపడుతున్న అనేక మంది వెల్లుల్లి తో నిద్రలో మెరుగుదలను చూసినట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి ప్రయోజనాలు వెల్లుల్లిలో విటమిన్లు మాంగనీస్, మరియు కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్లు %జు, ఖ% వంటి అనేక ఖనిజాలు ఉంటాయి. ఇది కాకుండా, వెల్లుల్లిలో అల్లిసిన్ వంటి శక్తివంతమైన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటాయి. వెల్లుల్లిలో అలిసిన్ ఉంటుంది. ఇది వ్యాధినిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. వెల్లుల్లితో నిద్ర నాణ్యత.. అధ్యయన ఫలితాలు ఈ లక్షణాలు నిద్రలేమికి సాధారణ కారణాలైన ఒత్తిడి మరియు ఆందోళనను తగ్గించడంలో సహాయపడవచ్చు. అదనంగా, వెల్లుల్లి యొక్క యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించగలవు, ఇది మెరుగైన నిద్రని ఇస్తుంది. అధ్యయనం ప్రకారం నిద్ర వ్యవధి మరియు నాణ్యతను మెరుగుపరచడంలో వెల్లుల్లి గణనీయమైన పాత్రను కలిగి ఉంది. రాత్రివేళ ఆహారంలో వెల్లుల్లిని చేర్చిన తర్వాత నిద్రపోయేవారు తక్కువ అంతరాయాలతో ఎక్కువ సేపు నిద్ర పోయారు. రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లి మంచి నిద్రనిస్తుంది కనుక వెల్లుల్లి మన నిద్రకు దోహదం చేసే గొప్ప గుణాలు కలిగి ఉందని నమ్మవచ్చనే అభిప్రాయం ఉంది. రోజువారీ భోజనాలలో వెల్లుల్లిని చేర్చడం మంచిది. మన ఆరోగ్యానికి ఇది ఒక ఖర్చు తక్కువ విధానం. ఇది వివిధ వంటకాలలో వివిధ రకాలుగా ఉపయోగించవచ్చు. ఆహారంలో భాగంగా దీనిని తీసుకోవడం నిద్రకు మాత్రమే కాదు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలిగిస్తుంది.ఏది ఏమైనా రాత్రి పడుకోబోయే ముందు వెల్లుల్లిని తీసుకోవడం మంచి నిద్రకు దోహదం చేస్తుందని అధ్యయనం నిద్రలేమితో బాధపడే వారికి ఒక మంచి శుభవార్త చెప్పినట్టే భావించాలి.

## డయాబెటిస్ పేషెంట్స్ రాగిజావ ఎక్కువగా తాగుతున్నారా?



డయాబెటిస్.. ఇప్పుడు ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారి. ప్రతి పదిమందిలో ఐదుగురు డయాబెటిస్ బాధితులు ఉంటున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. డయాబెటిస్‌ను పట్టించుకోకపోతే మనకు తెలియకుండానే మన ప్రాణాలను హరిస్తుంది. డయాబెటిస్ తో బాధపడేవారు మందులు తీసుకోవడంతో పాటు ముఖ్యంగా లైఫ్ స్టైల్ చేంజ్ చేసుకోవడం చాలా అవసరం. అన్నానికి బదులుగా రాగిజావ తినే ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించడం, ప్రతిరోజు వ్యాయామం చేయడం, యోగ సాధన చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రతిరోజు ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్రపోవడం ఎంతో అవసరం. ఇక్కడ డయాబెటిస్ తో బాధపడేవారు డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవడం కోసం చాలామంది అన్నానికి బదులుగా రాగిజావ ను తీసుకుంటున్నారు. రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా? అయితే రాగిజావ ని తీసుకోవడం మంచిదేనా? రాగి జావతో డయాబెటిస్ బాధితులకు ప్రయోజనం కలుగుతుందా అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం.రాగులలో ఫైబర్ అధికంగా ఉంటుంది. అంతేకాదు తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. అటువంటి రాగులు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి సహాయపడతాయి. రాగులలో ఉండే ఫైబర్ కారణంగా జీర్ణక్రియ మందగిస్తుంది. మధుమేహం ఉన్నవారికి ఇది మేలు చేస్తుందా? ఇది రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరగడానికి సహాయపడుతుంది. కాబట్టి ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇక్కడ చెక్కర స్థాయిలను వేగంగా రాగులు పెంచకపోవడం వల్ల, మధుమేహం ఉన్నవారు నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. అయితే రాగిజావ ని తీసుకోవడంలో ఒక ప్రమాదం కూడా ఉంది. రాగి జావను మితంగా తీసుకుంటే అది మన బ్లడ్ షుగర్ లెవల్స్ ను కంట్రోల్ చేస్తుంది. మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే డేంజర్ రాగి జావ ని తీసుకుంటే ఏమి కాదు అన్న ఉద్దేశంతో దానిని మోతాదు కంటే ఎక్కువగా తీసుకుంటే మళ్లీ అది మన బ్లడ్ షుగర్ లెవెల్స్ పెరగడానికి కారణమవుతుంది. పచ్చ జొన్నలు, సజ్జలు, కొర్రలు, ఒంద్రు కొర్రలు వంటి వాటితో పోల్చి చూస్తే రాగులు కాస్త త్వరగా షుగర్ లెవెల్స్ పెంచుతాయని చెప్పవచ్చు. రాగిజావ తీసుకోవాలంటే ఇలా చెయ్యండి కాబట్టి రాగిజావ ని తీసుకోవాలనుకునే వారు మితంగా తీసుకుంటే మంచిది. మీ ఆహారంలో మీరు రాగిజావ ను చేర్చాలి అనుకుంటే, మీ డయాబెటిస్ కు సంబంధించి చికిత్స తీసుకుంటున్న వైద్య నిపుణులతో సంప్రదించి ఆయన సూచన మేరకు తీసుకోవడం మంచిది.

## ఫేస్ క్రీములు అవసరం లేదు, ఈ నీళ్లు ఉంటే చాలు..
# మిలమిలా మెరిసిపోతారు అంతే!





చాలా మందికి మండే ఎండలో అందంగా కనిపించాలనే కోరిక ఉంటుంది. అందుకోసం చాలా మంది రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. క్రీములు అని, పేస్ ప్యాక్ అని ఏదేదో ప్రయత్నిస్తుంటారు. కానీ అవేమి సరైన ఫలితాలు ఇవ్వక అందరూ నిరాశకు గురవుతుంటారు. అయితే ఎవరైతే అందం మీద ఎక్కువగా ఆశ ఉంటుందో, అందంగా కనిపించాలనే కోరిక ఉంటుందో వారు రోజ్ వాటర్ వినియోగిస్తే చాలా మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది. ఇంతకీ రోజ్ వాటర్ వలన ఎలాంటి ఉపయోగాలు కలుగుతాయి? దానిని ఎలా ఉపయోగించాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం. టోనర్: రోజ్ వాటర్ ఒక అద్భుతమైన టోనర్. ఇది చర్మ రంధ్రాలను శుభ్రపరచడానికి, చర్మం %జూఎ% స్థాయిని సమతుల్యం చేయడానికి, చర్మాన్ని మృదువుగా చేయడానికి సహాయపడుతుంది. సైలైంట్ హార్ట్ ఎటాక్..నొప్పి లేకుండానే చంపేస్తది..మీ గుండె భద్రమో కాదో ఇలా తెలుసుకోండి మాయిశ్చరైజర్: రోజ్ వాటర్ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇది పొడి చర్మానికి మంచి మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. దీంతో చర్మం ఎప్పుడూ తాజాగా, తేమగా కనిపిస్తూ ఉంటుంది. మొటిమలు మరియు మచ్చలు: రోజ్ వాటర్‌లో యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి మొటిమలు మరియు మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. కళ్ళ కింద నల్లటి వలయాలు మరియు వాపు: రోజ్ వాటర్ కళ్ళ కింద నల్లటి వలయాలు మరియు వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. సన్ బర్న్ మరియు చర్మం చికాకు: రోజ్ వాటర్ సన్ బర్న్, చర్మం చికాకును తగ్గించడంలో సహాయపడుతుంది. జుట్టు సంరక్షణ కోసం జుట్టు కండీషనర్: రోజ్ వాటర్ జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేస్తుంది. చుండ్రు నివారణ: రోజ్ వాటర్‌లో యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి చుండ్రును తగ్గించడంలో సహాయపడతాయి. జుట్టు పెరుగుదల: రోజ్ వాటర్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇడ్లీ,దోశ కాదు..మన పూర్వీకులు పొద్దున్నే తిన్నది ఇదే..కొండలను ఢీకొట్టే శక్తి..ఎలా చేసుకోవాలంటే 00:00 రోజ్ వాటర్ మానసిక స్థితిని మెరుగుపరచడానికి మరియు ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. తలనొప్పి ఉపశమనం: రోజ్ వాటర్ తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. నిద్ర నాణ్యతను మెరుగుపరచడం: రోజ్ వాటర్ నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడం: రోజ్ వాటర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

# మార్కెట్

## మైక్రోసాఫ్ట్‌లో ఇజ్రాయెల్ అలజడి..
### 18 మంది ఉద్యోగులు అరెస్ట్

హమాస్ అంతమే లక్ష్యంగా గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మారణహోమం సృష్టిస్తోంది. వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. ఈ దాడుల్లో అనేక మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయితే, ఈ దాడులు టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌కు ఇబ్బందికరంగా మారాయి. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పాల్పడుతున్న దారుణాలపై అమెరికాలోని మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఇటీవలే నిరసనకు దిగారు. కంపెనీ రూపొందించిన టెక్నాలజీని ఉపయోగించి ఇజ్రాయెల్ సైన్యం దారుణాలకు పాల్పడుతోందని ఆరోపిస్తున్నారు. తక్షణమే ఇజ్రాయెల్ సైన్యంతో ఉన్న సాంకేతిక సంబంధాలకు ముగింపు పలకాలని మైక్రోసాఫ్ట్‌ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనలతో అప్రమత్తమైన సంస్థ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దాదాపు 18 మంది మైక్రోసాఫ్ట్ ఉద్యోగులను అరెస్ట్ చేశారు. ఇజ్రాయిల్ సైన్యం గాజాలో కార్యకలాపాలు నిర్వహించడానికి, పాలస్తీనియన్లపై నిఘా కోసం తమ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడాన్ని నిరసిస్తూ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. వాషింగ్టన్‌లోని రెడ్‌మండ్‌లోని కంపెనీ తూర్పు క్యాంపస్‌ను ఉద్యోగులు చుట్టుముట్టి నిరసన తెలిపారు. సంస్థ ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న రెడ్‌మండ్ పోలీసులు ఆగస్టు 20న మధ్యాహ్నం 12:15 గంటల సమయంలో ఆందోళన చేస్తున్న 18 మందిని అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో మైక్రోసాఫ్ట్ ప్రస్తుత, మాజీ ఉద్యోగులు ఉన్నట్లు తెలిసింది.




# జీఎస్టీలో ఇకపై రెండు స్లాబులే..

### కేంద్రం ప్రతిపాదనకు మంత్రుల బృందం ఆమోదం




వస్తువులు, సేవల పన్ను విధానాన్ని సవరించాలన్న కేంద్రం ప్రతిపాదనలకు మంత్రుల బృందం అంగీకరించింది. 12, 28 శాతం శ్లాబులు తొలగించి 5, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ మేరకు మంత్రుల బృందం ఆమోదం తెలిపింది. జీఎస్టీలో ప్రస్తుతం 5, 12, 18, 28 శాతం పన్ను స్లాబులున్నాయి. మార్కెట్‌లోని దాదాపు అన్ని వస్తూత్పత్తులపై ఈ స్లాబుల ప్రకారమే పరోక్ష పన్నులు పడుతున్నాయి. అయితే, 5, 18శాతం స్లాబ్‌లను మాత్రమే కొనసాగించాలని, 12, 28 స్లాబ్‌లను తొలగించాలని కేంద్రం ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన కమిటీకి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనకు ఆయా రాష్ట్రాల మంత్రులతో కూడిన బృందం తాజాగా ఆమోదం తెలిపింది. ఆల్ట్రా లగ్జరీ, సిన్ గూడ్స్ (సిగరెట్లు వంటివి)పై 40 శాతం పన్ను విధించడం కూడా కేంద్ర ప్రతిపాదనలో ఉందని యూపీ ఆర్థికమంత్రి సురేష్ కుమార్ ఖన్నా తెలిపారు. 12 శాతం స్లాబులోని 99 శాతం వస్తూత్పత్తులు 5 శాతంలోకి, 28 శాతం స్లాబులోని 90 శాతం వస్తూత్పత్తులు 18 శాతంలోకి రానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జీఎస్టీలో కనీస పన్ను 5 శాతం స్లాబులో రోజువారీ నిత్యావసర వస్తూత్పత్తులున్నాయి. ఇక స్టాండర్డ్ గూడ్స్‌పై 12 శాతం, ఎలక్ట్రానిక్స్, ఆయా రకాల సేవలపై 18 శాతం, పొగాకు, ఇతర విలాసవంతమైన ఐటమ్స్‌పై గరిష్ఠంగా 28 శాతం పన్నులు పడుతున్నాయి. ఈ క్రమంలోనే అదనంగా పాన్ మసాలా, లగ్జరీ కార్లు తదితరాలపై జీఎస్టీ నష్టపరిహార సెస్సును కూడా విధిస్తున్నారు. జీఎస్టీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయానికి వాటిల్లుతున్న నష్టాలను భర్తీ చేయడానికే ఈ సెస్సు. అలాగే కొన్ని నిత్యావసరాలకు జీఎస్టీ మినహాయింపుండగా.. ప్రత్యేకంగా వజ్రాలు, సానబెట్టిన రత్నాలు, బంగారంపై 0.25 శాతం నుంచి 3 శాతం వరకు జీఎస్టీ విధిస్తున్నారు.

ప్రజలకు లాభమెంత? ఇప్పుడున్న జీఎస్టీ స్లాబుల్లో 18 శాతం చాలా కీలకం. జీఎస్టీ వసూళ్లలో ఈ ఒక్క స్లాబు నుంచి వచ్చే ఆదాయం వాటానే 65 శాతంగా ఉన్నది. జీఎస్టీ 2.0లో ఈ స్లాబును యథాతథంగానే ఉంచుతుండటం గమనార్హం. అంటే ప్రస్తుతం ఈ స్లాబులో ఉన్న వస్తూత్పత్తుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు వస్తున్న ఆదాయానికి ఢోకా లేదన్నమాట. ఫలితంగా వాటి వినియోగదారులకు ఇకపైనా ఏమాత్రం ప్రయోజనం ఉండదు. ఇప్పుడు ఎంతకు కొంటున్నారో.. కొత్త జీఎస్టీ విధానంలోనూ వాటి కోసం అంతే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మోదీ సర్కారు గొప్పగా జనాలపై జీఎస్టీ భారాన్ని తగ్గించబోతున్నామని, దీపావళి కానుక అంటూ ఊదరగొడుతుండటం అంతా ఉత్తదే. మెజారిటీ వినియోగదారులకు జీఎస్టీ స్లాబుల తగ్గింపు వల్ల ఒనగూరుతున్నదేమీ లేదన్నది తేటతెల్లమైపోయింది. అలాగే ప్రస్తుతం పేద, మధ్య తరగతి వర్గాలు కొంటున్న 5 శాతం స్లాబులోని వస్తూత్పత్తులపై పన్ను భారం అలాగే ఉంటుంది. ఇక పొగాకు, ఆన్‌లైన్ గేమింగ్స్, లగ్జరీ బైకులు, కార్లు ఇతర వస్తూత్పత్తులపై గరిష్ఠంగా 40 శాతం జీఎస్టీ ఉండనే ఉంటున్నది. దీంతో కొత్త జీఎస్టీ విధానం వచ్చి పన్ను స్లాబులు తగ్గినా మొత్తం పన్ను భారం మాత్రం ఇప్పుడున్నట్టుగానే ఆయా కొనుగోలుదారులపై 88 శాతంగానే ఉంటుందన్న అంచనాలున్నాయి. దీంతో 12 శాతం, 28 శాతం స్లాబులను తీసేయడం వల్ల నష్టపోతున్న ఆదాయం అంతంత మాత్రమేనని పలువురు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. నిజానికి జీఎస్టీ వసూళ్లలో ఇప్పుడు 12 శాతం స్లాబు ద్వారా 5 శాతం, 28 శాతం స్లాబు ద్వారా 11 శాతం ఆదాయమే వస్తున్నది. ఏదిఏమైనా కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ స్లాబుల తగ్గింపు జిమ్మిక్కులకు ఈ లెక్కలన్నీ నిదర్శనం. అలాగే బంగారం, వజ్రాలు, ఇతర విలువైన రత్నాలపై జీఎస్టీ యథాతథంగానే ఉండనున్నది. దీంతో స్థూలంగా జీఎస్టీ స్లాబుల సవరణతో సగటు సాధారణ వినియోగదారునికి కేంద్రంలోని మోదీ సర్కారు చేకూర్చే లబ్ధి ఏమీ లేదని తేలిపోయింది.

# ఆంధ్రప్రదేశ్

## తిరుమల కల్తీ నెయ్యి కేసు

### దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఇడి సోదాలు

తిరుపతి,జూన్ 3 : తిరుమల కల్తీ నెయ్యి కేసుకు సంబంధించి ఈడీ అధికారులు దేశంలోని 15 ప్రాంతాల్లో సోదాలు చేశారు. గుంటూరు, ఢిల్లీ, ముంబయి, రాజ్‌కోట్, బికనీర్, డెహ్రాదూన్, రూర్కీ, అహల్యానగర్, దిండిగల్ తదితర ప్రాంతాల్లో పలువురి నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు చేశారు. పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేశ్ మన్సుఖ్‌లాల్, అపూర్వ వినయకాంత్, శాంతారామ్, అజయ్ కుమార్, మహేశ్‌కుమార్, ఆశిష్ అగర్వాల్ ఇళ్లలో సోదాలు చేసి రూ.60 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. స్థిర, చరాస్తుల్లో రూ.45 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు గుర్తించారు.

## నేడు కేరళను తాకనున్న నైరుతి

### కేరళతోపాటు తమిళనాడు తదితర ప్రాంతాలకు విస్తరణ

విశాఖపట్నం,జూన్ 3 : నైరుతి రుతుపవనాలు రాబోయే 24 గంటల్లో కేరళంలోకి ప్రవేశించ నున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. తద్వారా క్రమంగా దేశంలోని మిగతా ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించనున్నాయి. గురువారం నైరుతి రుతుపవనాలు.. నైరుతి, ఆగ్నేయ అరేబియా సముద్రంలోని ప్రాంతాలు, లక్షద్వీప్ దీవులు, కేరళ, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉత్తర తమిళనాడు వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే ఐదు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా కావలిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే గడిచిన 24 గంటల్లో అత్యధికంగా విశాఖపట్నం జిల్లా భీమిలి ప్రాంతంలో 2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. ప్రస్తుతం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది.

## ఎన్టీఆర్ రాకతోనే బడుగులకు రాజకీయ న్యాయం

### ఇవాళ ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటే ఊరుకుంటామా?

### రాజకీయ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ తెలంగాణ టిడిపి నేతలు

హైదరాబాద్,జూన్ 3 : ఎన్టీఆర్ పార్టీ ప ఎట్టి రాజకీయాల్లోకి వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు వచ్చిందని టీడీపీ తెలంగాణ నేతలు అన్నారు. ఈ మేరకు పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ తదితరులు మీడియాతో మాట్లాడారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని.. ఎన్టీఆర్ విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని.. అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. కొత్తగా పుట్టిన పార్టీ వాళ్లు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తుచేశారు. టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉందని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు.. తాము ముఖ్యమంత్రి అవుతామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటింగ్‌లు పెట్టుకోవచ్చని.. పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని... పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సారెడ్డి అన్నారు. తెలంగాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండున్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. 60-70 ఏళ్లు జరగని దోపిడీ కేసీఆర్ పాలనలో జరిగిందని ఆరోపించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ గడ్డ అభివృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సారెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠపాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యాసంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన పార్టీలకు ఇక్కడ మనుగడ ఉందని తెలిపారు. అడ్డుకుంటాం.. దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని నన్నూరి నర్సారెడ్డి పేర్కొన్నారు.

## మేలో భారీగా తిరుమల లడ్డూ విక్రయాలు

### మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు వెల్లడి

తిరుమల,జూన్3 : ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భారీగా భక్తులు తరలి ర ఆవడంతో ఆదాయంతో పాటు, లడ్డూ విక్రయాలు కూడా పెరిగాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు తితిదే వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి తితిదే రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

## రోడ్ల డ్యామేజీ గుర్తింపునకు డిజిటల్ డ్యాష్ బోర్డు

### రహదారుల నాణ్యత పెంచేలా ఆధునిక టోక్నాలజీ

### మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడి



అమరావతి,జూన్3 : రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రహదారి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. రోడ్ల డ్యామేజ్ గుర్తింపునకు డిజిటల్ డ్యాష్‌బోర్డ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రహదారుల నాణ్యత పెంచేందుకు ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. నాలుగేళ్లు మన్నే రోడ్లు 7-8 ఏళ్లు నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో పాటు కొత్త టెక్నాలజీతో రోడ్లు వేస్తూ మెయింటెనెన్స్ బాధ్యత కూడా కాంట్రాక్టు సంస్థలు తీసుకునేలా చేశామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెల్లడించారు. విశాఖ, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రూ.750 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.13 అసంపూర్ణ వంతెనలను పూర్తిచేసేందుకు ప్రత్యేక నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పిపిపి మోడల్‌లో భారీ రహదారి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామన్నారు. 405 కి.మీ మేర రూ.2506 కోట్లతో పీపీపీ విధానంలో 6 ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆధునిక ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. జాతీయ రహదారుల విస్తరణలో ఏపీ.. దేశంలో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో వేల కిలోమీటర్ల జాతీయ రహదారుల అభివృద్ధి జరుగుతోందన్నారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ తర్వాత అత్యధిక రహదారి పనులు ఏపీలోనే జరుగుతున్నాయని తెలిపారు. రూ.7,784 కోట్లతో కొత్త రహదారి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని.. మరో రూ.30,780 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రగతిలో ఉన్నాయని అన్నారు. రూ.18 వేల కోట్లతో 79 కొత్త ప్రాజెక్టులకు సిద్ధం అవుతున్నామన్నారు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం సమీక్ష చేస్తున్నట్లు తెలిపారు. ÷ాష్ట్రంలో ఏ ప్రాజెక్టు ఆగిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని బీసీ జనార్దన్ అన్నారు. కుప్పం, శ్రీకాకుళం, అమరావతి సహా నాలుగు విమామాశ్రయాలు కొత్తగా తీసుకొస్తున్నామని తెలిపారు. పోర్టుల అభివృద్ధితో రాష్ట్రానికి పెట్టుబడులు పెరుగుతున్నాయన్నారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో రాష్ట్ర ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత 5 ఏళ్ల విధ్వంస పాలన వల్ల రాష్ట్రంలో రోడ్లు వేసేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి ఉండేదని వ్యాఖ్యానించారు. పనులు లేక బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునేలా గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. మళ్లీ వస్తే అదే అరాచకం చేస్తామంటూ గొడ్డలి పార్టీ మాట్లాడుతోందని మండిపడ్డారు. గత రెండేళ్లలో రూ.3 వేల కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పెండింగ్ రహదారుల పనులు ప్రారంభించటంతో పాటు నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. రూ.439 కోట్లతో 400 కిలోమీటర్ల మేర గోదావరి పుష్కర పనులు చేపట్టామన్నారు.

## రాజధానిపై జగన్ నిత్య అసంతృప్తి

### ఓసారి మూడు రాజధానుల ప్రకటన

### ఇప్పుడేమో మావిగాన్ అంటూ కొత్త గానం

### జగన్ వ్యాఖ్యలు పిల్లలకు కూడా విసుగెత్తేలా ఉన్నాయి

### రాజధాని నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

అమరావతి,జూన్ 3 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. మావిగాన్ వ్యాఖ్యలపై మంత్రి నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మావిగాన్ వ్యాఖ్యల పట్ల చిన్న పిల్లలు కూడా నవ్వుకుంటున్నారన్నారు. ఒకారి మూడు రాజధానులు, ఇప్పుడేమో మావిగాన్ అంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు దుర్మార్గం అన్నారు. జగన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.రాజధాని ప్రాంతంలో మంత్రి నారాయణ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహ మార్గాలను, పెనుమాక రిజర్వాయర్‌ను పరిశీలించారు. రాజధాని రోడ్డుల నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలలో వాగుల ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. నిర్మాణం జరుగుతున్న వంతెనల క్రింది భాగంలో మట్టి పూడిక తీతలు త్వరగా తొలగించాలని ఆదేశించారు. తెలంగాణకు వచ్చే ఆదాయం హైదరాబాద్ నుంచి వస్తుందని.. అమరావతి ఆదాయం అన్ని జిల్లాలకు పంచుతారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి అంటే విజన్ ఉండాలని.. జగన్‌కు లేదంటూ వ్యాఖ్యానించారు. రైతులను ల్యాండ్ పూలింగ్‌కు రావాలని మరోసారి కోరుతున్నట్లు తెలిపారు. రైతుల దగ్గర బలవంతంగా తీసుకోకూడదనే ఇప్పటి వరకు ల్యాండ్ అక్విజేషన్‌కు వెళ్లలేదన్నారు. 2028 ఆగస్టు నాటికి రాజధాని దాదాపు సిద్ధం అవుతుందని స్పష్టం చేశారు. నేటికి నయా రాయపూర్ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జగన్ డేటా తీసుకుని మాట్లాడాలని హితవుపలికారు. అమరావతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. వర్షాకాలం వచ్చేలోగా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. గత వర్షాకాలం పశ్చిమ బైపాస్ కింద వాగులు పూడిపోవడంతో వాటర్ వెనక్కి తన్నిందని.. వెస్టర్న్ బైపాస్ దగ్గర 2 బ్రిడ్జి పనులు జరుగుతుండగా మరో 69 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతాయన్నారు. వెస్టర్న్ బైపాస్ వద్ద వెంట్స్‌ను పదిరోజుల్లో క్లియర్ చేస్తామని చెప్పారు. అమరావతి వాటర్ ఎ÷-లో కోసం నెదర్లాండ్స్ వాళ్లతో మాట్లాడి డిజైన్ చేశామన్నారు. పనులు జరుగుతున్నప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయని వెల్లడించారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ వరకు మాత్రమే ఇబ్బందులు ఉంటాయని.. తరువాత 69 బ్రిడ్జిలు పూర్తి అవుతాయని తెలిపారు. 200 సంవత్సరాల చరిత్ర తీసుకొని గ్రావిటీ కెనాల్‌లను ఏర్పాటు చేసినట్లు నారాయణ తెలిపారు. గత సంవత్సరం వెస్టర్న్ బైపాస్‌ను కడుతూ ప్రవాహం పూడ్చేశారని.. దీంతో అక్కడ పూడిక ఏర్పడిందన్నారు. ఈసారి అలాంటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. 494 ఎకరాలకు మాత్రమే ఇంకా ఎ÷-లాట్‌లు కేటాయించలేదని.. అక్కడ న్యాయపరమైన చిక్కులు, వారసత్వ ఇబ్బందులు ఉన్నాయన్నారు. లాటరీకి సిద్ధంగా 144 ఎకరాలు 74 మంది రైతులు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 35,057 ఎకరాలు తీసుకున్నామని.. ఇందులో రిటర్నబుల్ ఎ÷-లాట్‌లు ఇవాల్సింది 498 ఎకరాలు మాత్రమే అని మంత్రి నారాయణ వెల్లడించారు.

## రష్యా పర్యటనలో పెట్టుబడుల వేట

### పలు సంస్థల ప్రతినిధులతో లోకేశ్ భేటీ

### కెమికల్ సంస్థ రస్‌కెమ్ గ్రూపు సిఇవోతో చర్చలు

### రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమాలోచనలు

మాస్కో,జూన్3 : రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అపానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ-కాకినాడ పీసీపీఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ఏర్పాటు చేయండని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్తుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఏపీలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సీఈఓ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పీవీల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ఎ÷-లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.అలాగే రష్యా ప్రభుత్వ నియంత్రిత ప్రముఖ రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో నారా లోకేశ్ మాస్కోలో భేటీ అయ్యారు. వెస్ట్రన్ ఎ÷-లాట్‌ఫామ్‌లకు సురక్షితమైన లోకలైజ్డ్ జనరేటివ్ ఏఐ ప్రత్యామ్నాయ వ్యవస్థను అందించిన తరహాలోనే భారతదేశంలో బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు స్బేర్ బ్యాంక్ గిగాచాట్ ఎల్ఎల్ఎంను విస్తరించాలని నారా లోకేశ్ కోరారు. జాతీయ యూని÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ నెట్‌వర్క్ భద్రతను పటిష్ఠం చేస్తూ, స్బేర్‌బ్యాంక్ అడ్వాన్స్‌డ్ వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారతదేశ బ్యాంకింగ్ మౌలిక సదుపాయాల్లో ఇంటిగ్రేట్ చేసేలా సాంకేతిక సహకారం అందించాలన్నారు. భారత్‌లో పెద్దఎత్తున మున్సిపల్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్, డిజిటల్ సేఫ్టీ సిస్టమ్‌లను విస్తరించాలన్నారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లకు వేగంగా శిక్షణ ఇవ్వడానికి, స్బేర్ బ్యాంక్ గేమ్గి÷డ్, పీర్-టు-పీర్ 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూరప్రాంతాలకు రూపాయి-రూబుల్ వాణిజ్య అనుమతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్-రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి నారా లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## గుడ్డ కాల్చి మీద వేస్తామంటే ఊరుకోం

### డిఎస్సీ ఆరోపిణలపై ఆధారాలు లేకుండా విమర్శలా

### జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత

అమరావతి,జూన్ 3 : డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఏ ఆత్మ చెప్తే.. జగన్ 9 నెలల తర్వాత విషప్రచారం మొదలుపెట్టారంటూ హోం మంత్రి వంగలపూడి వ్యాఖ్యానించారు. గుడ్డ కాల్చి ముఖాన వేస్తే తుడుచుకునే పరిస్థితుల్లో లేమని అన్నారు. ఎవరు కాల్చారు, ఏ ఉద్దేశ్యంతో కాల్చారో ప్రజలకు ప్రతిదీ బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ మురకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజలకు అర్థమయ్యేలా సమాధానం చెప్తామని.. విషప్రచారాలను కట్టడి చేస్తామన్నారు. తప్పుడు ప్రచారాలు చేసే వారిపై క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిలో అత్యధిక శాతం టీడీపీ ప్రభుత్వంలో నియమితులైన వారే అని మంత్రి అన్నారు. డీఎస్సీ పోస్టింగ్ అనేది ఎన్నో కుటుంబాలకు ఎమోషనల్ బాండింగ్ అని తెలిపారు. ఏ కోర్టు కేసూ అడ్డంకి రాకుండా అన్ని సమస్యలూ పరిష్కరించి గౌరవ ప్రదంగా ప్రతి ఒక్కరికీ నియామకపత్రాలు అందజేశామన్నారు. లీక్‌కు స్కోప్ లేకపోవటంతో స్పోర్ట్స్ కోటాపై పడ్డారని మండిపడ్డారు. బీకాంలో కెమిస్ట్రీ చదివిన ఘనులంతా గొడ్డలిపార్టీలో ఉండి ఏది పడితే అది మాట్లాడుతున్నారని సెటైర్ విసిరారు. సమాధానం అవసరం లేదని, సమస్య సృష్టించటమే అవసరం అన్నట్లుగా వారి వ్యవహార శైలి ఉందన్నారు. గొడ్డలి పార్టీ అధికారంలో ఉండగా 2022లో తెచ్చిన హారిజాంటల్ రిజర్వేషన్ ఆధారంగానే డీఎస్సీ నియామకాలు జరిగాయని హోంమంత్రి చెప్పారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు పెట్టిన మహామహులు బ్రిడ్జి స్పోర్ట్స్ గురించి అవగాహన లేమితో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నేతలు నిర్వహించిన పేకాట క్లబ్‌లు కాదన్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్1 నియామకాలు ఏ పరిస్థితుల్లో ఉన్నాయో అందరికీ తెలుసని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## పండు మాస్టర్‌కు ప్రమాదం లేదన్న వైద్యులు

### విశాఖ ఆస్పత్రిలో కాళ్లకు శస్త్ర చికిత్సలు

### రోడ్డు ప్రమాదంలో కాళ్లకు తీవ్ర గాయాలు

విశాఖపట్టణం,జూన్3 : ప్రఖ్యాత డ్యాన్స్ షో 'ఢీ' ద్వారా తెలుగు ప్రేక్షకులకు ఎంతో చేరువైన ప్రముఖ కొరియోగ్రాఫర్, డ్యాన్సర్ పండు మాస్టర్ విశాఖపట్నంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు తాజాగా హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం ప్రమాదంలో పండు మాస్టర్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ముఖ్యంగా హిప్ జాయింట్ డిస్‌లొకేట్ కావడంతో పాటు మోకాళ్ల కింద భాగంలోని ఎముకలు, జాయింట్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. అన్ని వైద్య పరీక్షలు పూర్తిచేసిన అనంతరం ఒక సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. హిప్ జాయింట్‌కు సంబంధించిన సమస్యను తొలి ఆపరేషన్ ద్వారా పరిష్కరించామని, మిగిలిన గాయాలకు సంబంధించి మరికొన్ని శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని డాక్టర్లు తెలిపారు. ప్రమాద సమయంలో తలకు కూడా గాయం అయినప్పటికీ ప్రస్తుతం ఎలాంటి ప్రాణాపాయ పరిస్థితి లేదని స్పష్టం చేశారు. పండు మాస్టర్ అభిమానులను ఎక్కువగా ఆందోళనకు గురిచేసిన అంశం ఆయన భవిష్యత్తులో మళ్లీ డ్యాన్స్ చేయగలరా అనే ప్రశ్న. దీనిపై వైద్యులు సానుకూల సమాచారం ఇచ్చారు. అవసరమైన శస్త్రచికిత్సలు పూర్తయిన తర్వాత కనీసం ఆరు నెలల పాటు విశ్రాంతి తీసుకుంటే పూర్తిగా కోలుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడిన అనంతరం తిరిగి తన డ్యాన్స్ కెరీర్‌ను కొనసాగించవచ్చని, ప్రస్తుతం అందుకు ఎలాంటి ప్రమాద సూచనలు కనిపించడం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ సమాచారం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది.



# సినిమా వేరు.. వ్యక్తిగత జీవితం వేరు: రష్మిక


సామాజిక మాధ్యమాల్లో ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ దృఢంగా ఉండి.. నా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నానని అందాల తార రష్మిక అంటోంది. 'పుష్ప 2', 'కుబేర' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరుమీదుంది భామ. ప్రస్తుతం మహిళా ప్రాధాన్య కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. తన భావోద్వేగాలను ప్రజల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడనని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ.. నేను ఒక నటిని. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను ఇంట్లో ఎలా ఉంటానో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా ఎమోషనల్ పర్సన్‌ని నేను. కానీ నేను నా భావోద్వేగాలను బయటికి చూపించను. ఎందుకంటే అభిమానులు నా దయా గుణాన్ని నా బలహీనత అనుకుంటారు. లేకపోతే నేను కెమెరాల కోసమే ఇదంతా చేస్తున్నా అనుకుంటారు. మనం ఎంత నిజాయతీగా ఉంటే.. అంత వ్యతిరేకత మనపై వస్తుంది. దీంతో పాటు నా చుట్టూ ఉండే నెగిటివిటీతో ప్రభావితం కాకుండా ఉండటానికి కూడా చాలా కష్టపడుతున్నానని చెప్పుకొచ్చింది.






# ఇరుముడి తాజా గ్లింప్స్ విడుదల

మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి'ని చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్ చూస్తుంటే.. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే బలమైన ఎమోషనల్ బాండింగ్ చుట్టూ కథ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. తాగుడికి బానిసైన తండ్రి ఆ వ్యసనానికి దూరమవ్వడం కోసం అయ్యప్ప మాలా వేసిన అనంతరం జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. అయ్యప్ప స్వామి భక్తి, అయ్యప్ప మాల నేపథ్యంతో పాటు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆధ్యాత్మికత, ఫ్యామిలీ ఎమోషన్స్ సమానంగా ఉండేలా రవితేజను ఒక సరికొత్త రిఫ్రెషింగ్ అవతార్‌లో చూపించబోతున్నాడు శివ నిర్వాణ. ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, రవితేజ కుమార్తెగా బేబీ నక్షత్ర, ఇతర కీలక పాత్రల్లో సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, స్వాసిక నటిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రానికి విష్ణు శర్మ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని జులై లేదా ఆగస్టు 2026లో భారీ స్థాయిలో విడుదల చేయడానికి చిత్రబృందం ప్లాన్ చేస్తోంది.







## విడుదలకు ముందే పెద్ది రికార్డులు

భారీ అంచనాలతో రానున్న 'పెద్ది' విడుదలకు ముందే రికార్డులు నెలకొల్పుతోంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఓవర్సీస్‌లో ఒకరోజు ముందుగానే జూన్ 3న విడుదల కానుంది. అక్కడ ప్రీ బుకింగ్స్ ఓపెన్ కాగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. దీంతో ఈ చిత్రం రిలీజ్‌కు ముందే వన్ మిలియన్ క్లబ్‌లోకి చేరింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల గ్రాస్ మార్క్‌ను చేరుకుని రికార్డు సృష్టించింది. 'ఆర్ఆర్ఆర్' తర్వాత ప్రీమియర్స్ లోనే చరణ్‌కు ఇదే వన్ మిలియన్ మార్క్ సినిమాగా తెలుస్తోంది. మరోవైపు చిత్రబృందం ప్రచార జోరు పెంచింది. తాజాగా బుచ్చిబాబు ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. చరణ్ ఎంతో కష్టపడ్డారని అన్నారు. పెద్ది అందరి గుండెల్లో ఎప్పటికీ ఉండిపోతాడని చెప్పారు. అందుకు కారణం రామ్‌చరణ్ ఆ పాత్రలో ఒదిగిపోయిన విధానమేనన్నారు. కుస్తీ సన్నివేశాల్లో దెబ్బలు తగిలినా లెక్క చేయకుండా నటించారని ప్రశంసించారు. కంటికి గాయం అయినప్పుడు చిరంజీవి ఏమంటారో అని తనకు భయమేసిందని చెప్పారు. చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో జగపతి బాబు, శివరాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు.

# నేడు పెద్ది మూవీ విడుదల

## రామ్‌చరణ్‌కు పవన్ శుభాకాంక్షలు

రామ్ చరణ్ అభిమానులు ఎంతో కాలంగా ఎదరుచూసిన రోజు వచ్చేసింది. మరికొన్ని గంటల్లో ప్రీమియర్లతో.. 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేయనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ సెలబ్రిటీలు విషెస్ చెబుతున్నారు. తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'పెద్ది' టీమ్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ మేరకు తన సొంత నిర్మాణ సంస్థ 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన రామ్ చరణ్ .. పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులతో 'పెద్ది' సినిమా అన్ని ఆటంకాలను దాటుకొని విజయం సాధించాలని పవన్ ఆకాంక్షించారు. చిన్నప్పుడు రామ్ చరణ్‌ను ఆయన ఆశీర్వదిస్తున్న ఫొటోతో ప్రారంభమైన ఓ వీడియోను 'పవన్‌కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' షేర్ చేసింది. ఈ వీడియోను రీ షేర్ చేసిన చరణ్.. 'మీ మాటలు నాకు, పెద్ది టీమ్‌కు ఎంతో విలువైనవి. మాపై మీకున్న ప్రేమ, మద్దతుకు కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. మరోవైపు, పవన్ సతీమణి అన్నా కొణిదెల కూడా 'పెద్ది' టీమ్‌కు విషెస్ చెప్పారు. ఈ మూవీ ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సినిమా మొత్తానికి దిల్లీ ఎపిసోడ్ హైలైట్‌గా నిలుస్తుందని మొదటి నుంచీ టీమ్ చెబుతూనే ఉంది. తాజాగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ పోస్ట్ పెట్టారు. దిల్లీ ఎపిసోడ్ మొత్తం భావోద్వేగాలతో, మాస్ యాక్షన్‌లతో నిండిపోతుందని చెప్పారు. బుచ్చిబాబు ఈ సన్నివేశాలను అద్భుతంగా చిత్రీకరించారని తెలిపారు. తాను ఈ సినిమాలో భాగం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆ ఎపిసోడ్ షూటింగ్‌లో రామ్ చరణ్‌తో కలిసి దిగిన ఫొటోలను జానీ మాస్టర్ పంచుకున్నారు.







## సత్యదేవ్ కథానాకుడిగా ఆర్‌బి వర్కింగ్ టైటిల్

కేరాఫ్ కంచరపాలెం' ,'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు వెంకటేశ్ మహా. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాల అనంతరం వెంకటేశ్ చాలా రోజుల గ్యాప్ తర్వాత తన కొత్త సినిమాను ప్రకటించాడు. ఆర్‌బీ అనే వర్కింగ్ -టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో సత్యదేవ్ కథానాయకుడిగా నటించబోతుండగా.. జీఎంబీ, శ్రీచక్ర ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌లపై మహేశ్ బాబు, అనురాగ్ రెడ్డి నిర్మించబోతున్నట్లు- సమాచారం. ఈ సినిమా -టైటిల్‌తో పాటు- ఫస్ట్ లుక్‌ని మంగళవారం గంటలకు విడుదల చేయబోతున్నట్లు- చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.



## డాన్ -3 వివాదానికి తాత్కాలిక తెర

రణ్‌వీర్ లీగల్ నోటీసులు..నిషేధం ఎత్తివేసిన నిర్మాణ సంస్థ బాలీవుడ్‌లో చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం రోజురోజుకూ ముదురుతోంది. తాజాగా ఈ వివాదం కోర్టు మెట్లెక్కింది. తనపై నిషేధం విధించిన ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సంస్థకు మంగళవారం రణ్‌వీర్ లీగల్ నోటీసులు పంపారు. మరోవైపు తమకు నోటీసులు అందినట్లు ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ ధ్రువీకరించారు. బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించాలనుకున్న 'డాన్ 3' సినిమా నుంచి రణ్‌వీర్ మధ్యలో వైదొలిగారు. ఈ క్రమంలో.. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకూ ఆయనతో కలిసి పని చేయవద్దని ఆదేశిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటన జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై నటుడి టీమ్ స్పందిస్తూ.. ఆయనకు వృత్తిపై అపారమైన గౌరవం ఉందని తెలిపింది. సినిమా హిట్ కావాలని కోరుకుంటారని అందుకే ఈ వివాదంపై మౌనంగా ఉంటున్నారని వెల్లడించింది. ఈక్రమంలో బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్‌కు పెద్ద ఉపశమనం లభించింది. ఆయనపై విధించిన నాన్-కోఆపరేషన్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ బుధవారం ప్రకటించింది. ఫర్హాన్ అక్తర్ సినిమా 'డాన్ 3' నుండి రణవీర్ తప్పుకోవడంతో ఈ వివాదం మొదలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రణవీర్ సింగ్ సదరు సంస్థకు లీగల్ నోటీసు పంపిన కొద్ది గంటల్లోనే ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com